




నేటి దినపత్రిక **సూర్య**

www.suryaa.com

గుంటూరు పల్నాడు

ఆదివారం 27 జులై 2025 - పేజీలు 8






# వెటర్నరీ డాక్టర్ల ఇష్టారాజ్యం

- పశు వైద్యాన్ని గాలికొదిలేసి సొంత వ్యాపారాలు
- పై అధికారులను మేనేజ్ చేస్తూ విధులకు డుమ్మా
- సకాలంలో వైద్యం అందక పశువులు మృత్యువాత..!
- ప్రైవేటు కాంపౌండర్లు, డాక్టర్లను ఆశ్రయిస్తున్న రైతులు
- డాక్టర్ల పనితీరుపై పూర్తిగా కొరవడిన నియంత్రణ


వెటర్నరీ డాక్టర్ల తీరు ఆడిందే ఆట.. పాడిందే పాటగా మారింది. పశువుల ఆసుపత్రులకు రాకుండా.. సొంత వ్యాపారాల్లో మునిగి తేలుతూ.. పశువుల వైద్యాన్ని గాలికొదిలేసి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.. దీంతో పశువులకు సకాలంలో వైద్యం అందక మృత్యువాత పడుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.. తమ పశువుల ప్రాణాలను కాపాడుకొనేందుకు రైతులు గత్యంతరం లేని పరిస్థితుల్లో ప్రైవేటు కాంపౌండర్లు, వైద్యులను ఆశ్రయిస్తున్నారని తెలిసింది..



.. 3లో

## గుంటూరు ఎన్టీఆర్ బస్టాండ్‌లో ప్రయాణికులు తస్మాత్ జాగ్రత్త

- గుంటూరు ఎన్టీఆర్ బస్సు స్టేషన్లో చిల్లర దందా
- చిల్లర తగ్గించ్చి ఇస్తున్న షాపులవారు
- ప్రయాణికులతో వాదనలు ఇది షరా మామూలే
- పట్టించు కోని అది కారులు



**గుంటూరు, మేజర్ న్యూస్ :** అవసరం లేకున్నా వంద రూపాయల నోట్లు చూపిస్తూ చిల్లర కావాలా అంటూ కేకలు వేస్తారు నిజమని నమ్మి పెద్ద నోట్లు ఇచ్చి చిల్లర కొరకు వెళ్లిన ప్రయానికులకు చుక్కలు చూపిస్తారు నోట్లు తగ్గించ్చి ఇవ్వటం, మరలా మరలా లెక్కపెట్టమనటం వాదులాడితే చిల్లర సరిపడా ఇవ్వకుండా తిరిగి పెద్ద నోట్లు ఇచ్చేయ్యటం, బస్సుల హడావుడి లో ఏదైనా వస్తువులు కొని పెద్ద నోట్లు ఇస్తే చిల్లర తగ్గించి ఇవ్వటం తీరా బస్సు ఎక్కినాక చూస్తే ప్రయాణికులు గొల్లు మంఠం ఎన్టీఆర్ బస్సు స్టాండ్డులో సర్వసాధారణంగా ఇలాంటి దృశ్యాలు ఈమధ్య కనిపిస్తున్నాయి. శనివారం సాయంత్రం చిన్నలింగాయపాలెం హరిజనవాడకు చెందిన ఒకరు 500 నోట్ ఇచ్చి కూల్డ్రింక్ కొనుగోలు చేశారు. చిన్నలింగాయపాలెం బస్సు బయలు ధేరు హడావుడిలో వారు చిల్లర డబ్బులు జేబులో పెట్టుకున్నారు .బస్సు స్టాండ్ నుండి బయటకు

మిగతా 3లో

## ప్రతి చోటా.. అభివృద్ధికి బాట... సంక్షేమాన్ని ప్రతి గుమ్మానికి చేర్చాం

### ప్రజల సంతోషాలే ప్రభుత్వ లక్ష్యం

### ఎమ్మెల్యే నసీర్, నక్కా ఆనంద్ బాబు



**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో :** నగరంలోని తొమ్మిదో వార్డు రూపురేఖలు మార్చేశాం. అధికారం చేపట్టిన వెంటనే ఈ వార్డు అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాం. కేవలం ఏడాదిలోనే సుమారు రూ.5 కోట్లతో సీసీ, రోడ్లు డ్రైయిన్లు నిర్మించాం. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాం. అందుకే ప్రజల నుంచి అపూర్వ స్వాగతం లభిస్తోంది ” అని గుంటూర తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. సుపరిపాలన –తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక తొమ్మిదో వార్డులో వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబుతో

మిగతా 3లో



## అసెంబ్లీ మైనారిటీ కమిటీ చైర్మన్ గా నసీర్

### సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ కు ధన్యవాదాలు తెలిపిన ఎమ్మెల్యే.

### మైనారిటీ అభ్యున్నతికి కృషి చేస్తానని వెల్లడి

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో:** అసెంబ్లీ మైనారిటీ కమిటీ చైర్మన్ గా గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం రాత్రి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ తనను ఈ పదవికి ఎంపిక చేసిన సీఎం చంద్రబాబు నాయుడు, విద్యా శాఖ మంత్రి లోకేశ్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో మైనారిటీ సంక్షేమానికి, అభ్యున్నతికి కృషి చేస్తానని

మిగతా 3లో

## బాలికలకు నిత్యవసర సరుకుల పంపిణీ



**మంగళగిరి,మేజర్ న్యూస్:** కాజటోల్గేట్ వద్ద ఎస్కేసీవీ చిల్డ్రన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న ఆమోదిని గర్ల్స్ హోమ్‌లో అనంతపురం జిల్లా, నేలకోట తండాకు చెందిన గిరిజన ప్రజా సమాఖ్య వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు, మాజీ రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్య శంకర్ నాయక్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని శంకర్ షాలిని ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి బాలికలకు నిత్యవసరాలను పంపిణీ చేశారు. ఫౌండేషన్ ఉపాధ్యక్షురాలు భూక్యా షాలిని చేతుల మీదుగా బాలికలకు నిత్యవసరాలను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడారు. శంకర్ నాయక్, గిరిజన ప్రజా సమాఖ్య, గిరిజన విద్యార్థి సమాఖ్యలను స్థాపించి చదువు, సమీకరించు, సాధించు అనే నినాదంతో పేద గిరిజనులకు విద్య ద్వారా వారి బ్రతుకుల్లో మార్పులు వస్తాయని ఎన్నో సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. రాష్ట్రంలో గిరిజనులకు అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. భవిష్యత్తులో నాయక్ గిరిజనుల అభివృద్ధికి మరింత కృషి చేస్తూ సంపూర్ణ ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు వర్ధిల్లాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గిరిజన ప్రజా సమాఖ్య నాయకులు పీ దుర్గా నాయక్, బొక్కా అగస్టిన్, ఆవుకు గోపి చందు, మైనార్టీ నాయకులు షేక్ బాజీ సైదా తదితరులు పాల్గొన్నారు.

# గర్భిణీలు బలమైన పౌష్టికాహారం తీసుకోవాలి

**– జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ కె.విజయలక్ష్మి**







**మంగళగిరి, మేజర్ న్యూస్:** గర్భిణీలు బలమైన పౌష్టికాహారం తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ కె.విజయలక్ష్మి అన్నారు. నగర పరిధిలోని ఇందిరా నగర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ లో శనివారం రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి ఆధ్వర్యంలో మాతృ శిశు ఆరోగ్యం కార్యక్రమంలో భాగంగా రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 3150 డిజిగ్నేటెడ్ డే సందర్భంగా 40 మంది గర్భిణీ స్త్రీలకు ప్రోటీన్ సప్లిమెంట్లు, తాజా పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ కే విజయలక్ష్మి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. గర్భధారణ సమయంలో ప్రోటీన్ సప్లిమెంట్లు, తాజా పండ్లు తీసుకోవడం ద్వారా తల్లి, బిడ్డ ఇద్దరికీ అనేక ప్రయోజనాలు కలుగుతాయన్నారు. ప్రోటీన్ సప్లిమెంట్లు శిశువు పెరుగుదలకు, కండరాల వృద్ధితో పాటు బరువు పెరిగేందుకు సహాయపడతాయని తెలిపారు. రోటరీ క్లబ్ అధ్యక్షులు ప్రెగడ రాజశేఖర్ మాట్లాడుతూ... తాజా పండ్లు విటమిన్లు, ఖనిజాలు, ఫైబర్ ను అందిస్తాయన్నారు. రోగ నిరోధక శక్తిని పెంచడం ద్వారా తల్లి ఆరోగ్యకరమైన బిడ్డను ప్రసవించడం సాధ్యపడుతుందని, తద్వారా భవిష్యత్తులో ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించవచ్చునన్నారు. చీరాల రోటరీ క్లబ్ ప్రతినిధి కరణం శ్రీనివాస బాబు మాట్లాడుతూ... గర్భధారణ సమయంలో తల్లి, బిడ్డ ఇద్దరి ఆరోగ్యం ఎంతో ముఖ్యమని, కావున తాజా పండ్లు, ప్రోటీన్ సప్లిమెంట్లు తీసుకోవడం ద్వారా బిడ్డ ఆరోగ్యకరమైన బరువు పెరగడానికి సహాయపడుతుందన్నారు. యూపీ హెచ్ సీ వైద్యాధికారిణి డాక్టర్ పరుచూరి అనూష మాట్లాడుతూ... ప్రోటీన్ సప్లిమెంట్లు శిశువు కణజాలం అవయవాల అభివృద్ధికి దోహదపడుతాయని, కావున గర్భిణీలు బలవర్ధకమైన ఆహార పదార్థాలను తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి రోటరీ క్లబ్ కార్యదర్శి పారేపల్లి నిరంజన్ గుప్తా, క్లబ్ చార్టెడ్ ప్రెసిడెంట్ అనిల్ చక్రవర్తి, కోశాధికారి కెవిఎస్ ప్రకాశరావు, డైరెక్టర్ సర్వీస్ ప్రాజెక్ట్ చనుమోలు గోపాల్, రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షులు గాజుల శ్రీనివాసరావు, డాక్టర్ మాజేటి వంశీకృష్ణ, త్రిపుర మల్లు సతీష్‌లతో పాటు పలువురు యూపీ హెచ్ సీ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రగడ కోటయ్య సేవలు చిరస్మరణీయం

**– ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ**



**మంగళగిరి, మేజర్ న్యూస్:** చేనేతల అభ్యున్నతికి తన జీవితాంతం పోరాడిన యోధుడు ప్రగడ కోటయ్య అని ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ కొనియాడారు. శనివారం నగరంలోని టిడిపి కార్యాలయం ఎంఎస్ఎస్ భవన్ లో పట్టణ అధ్యక్షుడు పడవల మహేష్ అధ్యక్షతన ప్రగడ కోటయ్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కోటయ్య చిత్రపటానికి ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ చేనేత నాయకులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ మాట్లాడుతూ.... గుంటూరు జిల్లా నిడుబ్రోలు గ్రామంలో 1915 వ సంవత్సరం జులై నెల 26వ తేదీన జన్మించిన ప్రగడ కోటయ్య చేనేత బిడ్డగా తన తుది శ్వాస వరకు దేశంలోని చేనేత ప్రజల సంక్షేమం, చేనేత కార్మికుల సమస్యలు, చేనేత పరిశ్రమ కోసం నిరంతరం తపించి ప్రభుత్వాలతో పోరాడిన పోరాట యోధుడు అని కొనియాడారు. సహకార సంఘాల ఏర్పాటుకు ఎంతో కృషి చేశారన్నారు. మూడు సార్లు ఎమ్మెల్యేగా, శాసనమండలి సభ్యులుగా, రాజ్యసభ సభ్యులుగా చట్టసభల్లో చేనేత హక్కుల కోసం తన గళాన్ని వినిపించిన నేత ప్రగడ కోటయ్య అన్నారు. ప్రగడ కోటయ్య స్ఫూర్తితో మంత్రి నారా లోకేష్ చేనేతలకు అండగా నిలుస్తూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని అన్నారు. చేనేతల ఆర్థిక అభివృద్ధికి మంత్రి నారా లోకేష్ సొంత నిధులతో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీటీడీ మండలి సభ్యురాలు తమ్మిశెట్టి జానకి దేవి, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి గుత్తికొండ ధనుంజయ రావు, టిడిపి నాయకులు మున్నంగి శివ శేషగిరిరావు, కారంపూడి అంకమ్మరావు, ఊట్ల శ్రీమన్నారాయణ, సుఖ మంచి గిరిబాబు, జంజనం వెంకట సుబ్బారావు, భట్టు చిదానంద శాస్త్రి, వంగర పెద లక్ష్మయ్య, పొట్లా బత్తుని లక్ష్మణరావు, ఊట్ల దుర్గా మల్లేశ్వరి, గోవాడ దుర్గారావు, జంజనం శ్రీనివాసరావు, వాకా మాధవరావు, జొన్నాదుల బాలకృష్ణ, బూదాటి శ్రీనివాసరావు, గంజి చంద్రశేఖర్, కౌతవరపు శ్రీనివాసరావు, కోసూరి రాజా, తుమ్మ సర్వేశ్వరరావు, తేలు వెంకటేశ్వర్లు, తోట గౌరీ శంకర్, రామకోటయ్య, రవికుమార్ ,ఉప్పు మహేష్, కాకి మల్లికార్జున రావు, దాసరి సాంబశివరావు, అల్లాడి శ్రీను, తిప్పన అప్పారావు, చీరపు సూర్యనారాయణ, గంజి శివ, రంగిశెట్టి పెద్దబ్బాయి, గంజి లక్ష్మయ్య, కొండవీటి కోటేశ్వరరావు, కొడాలి కామేశ్వరరావు, మునగపాటి ప్రసన్న, వెంకటేశ్వరరావు, కుంభా రాంబాబు, కొత్తా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# దంత సంరక్షణపై అవగాహన కలిగి ఉండాలి




**గుంటూరు, మేజర్ న్యూస్:** సమాజంలోని ప్రతి ఒక్కరూ దంత సంరక్షణ పై అవగాహన కలిగి ఉండాలని రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు సెంటీనీయల్ అధ్యక్షులు డా. వీరా ఆతుకూరి అన్నారు. యనమదల జిల్లా ఉన్నత ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు దంత పరీక్షలు మరియు బ్లడ్ గ్రూపింగ్ టెస్ట్ శనివారం నిర్వహించారు. కళ్యాణి డెంటల్ స్కిన్ అండ్ హెయిర్ క్లినిక్ డాక్టర్ రాజశేఖర్ బాబు, రెయిన్ బో బ్లడ్ బ్యాంక్ గుంటూరు డైరెక్టర్ నవీన్ చక్రవర్తి తొట్టెంపూడి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. రోజుకు రెండు నుంచి మూడు నిమిషాలు పాటు రెండు సార్లు దంతాలను శుభ్రం చేసుకోవాలని వైద్యులు సూచించారు. క్లబ్ కార్యదర్శి సంతోష్ కుమార్ చవేరా, సీతారాం, ప్రభాకర్, మహానంద రెడ్డి, మరియు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కార్గిల్ విజయ్ దివాస్ సందర్భంగా ఎన్‌సీసీ కాడేట్స్ క్యాండిల్ ర్యాలీ




**నరసరావుపేట మేజర్ న్యూస్ :** కార్గిల్ విజయ్ దినోత్సవం సందర్భంగా నరసరావు పేట ఇంజనీరింగ్ కళాశాల కు చెందిన ఎన్ సి సి క్యాడెట్లు, దేశానికి తమ సేవలు అర్పించిన అమరజవాన్లకు ఘన నివాళులర్పిస్తూ క్యాండిల్ ర్యాలీను అత్యంత దేశభక్తి శోభతో నిర్వహించారని కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎస్. వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా క్యాడెట్లు తమ చేతుల్లో దీపాలను (క్యాండిల్స్) పట్టుకొని, కళాశాల లో దేశభక్తి నినాదాలు చేస్తూ విద్యార్థులందరిలో జాతీయతా స్పూర్తిని రేకెత్తించారని తెలిపారు. ప్రిన్సిపాల్ డా. ఎస్. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ "పాఠశాలలు, కళాశాలలు విద్య ఇచ్చే స్థలాలే కాదు – దేశభక్తి పెంపొందించే పీఠాలుగా కూడా ఉండాలి ఎన్సిసి వంటి సంస్థల వల్లే విద్యార్థుల్లో దేశానికి గౌరవం, బాధ్యత పెరుగుతుందని తెలిపారు. కళాశాల ఎన్సిసి అధికారి లెఫ్టినెంట్ మేడికొండ రాజేష్ బాబు మట్లాడుతూ భారత సైన్యం శత్రువులను వెనక్కుతరిమేసి, జూలై 26, 1999 న తిరిగి భారత భూభాగాన్ని సంపూర్ణంగా తన ఆధీనంలోకి తెచ్చుకుందని, ఈ సంఘటన అనంతరం ప్రతి సంవత్సరం జూలై 26వ తేదీని కార్గిల్ విజయ్ దినోత్సవంగా జరుపుకుంటున్నామని, ఇది దేశానికి సేవ చేసిన అమరవీరుల త్యాగాలను గుర్తు చేసే రోజుగా నిలిచిందని తెలిపారు. ర్యాలీ ప్రారంభానికి ముందు అధికారుల పర్యవేక్షణలో, క్యాడెట్లు శ్రద్ధగా సరైన పరేడ్ రూపంలో ఏర్పాటై, శాంతియుతంగా సముదాయంగా నడుస్తూ ముందుకు సాగారు. ప్రతి ఒక్కరూ చేతిలో దీపాలు పట్టుకొని – శత్రు సంహారానికి ప్రాణాలు అర్పించిన కార్గిల్ అమరజవాన్లను స్మరించుకున్నారు పరేడ్ ప్రారంభించిన సమయంలో భారత జాతీయ గీతం ఆలపించబడింది. అనంతరం "జై జవాన్", "వందేమాతరం", "భారత్ మాతా కి జై" వంటి నినాదాలు ర్యాలీ మొత్తం మారుమోగాయి కార్యక్రమం లొ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా. డి. సునీల్ , డీన్ శర్మ , మెకానికల్ విభాగధిపతి డా. వెంకట శివ మరియు కాడేట్స్ పాల్గొన్నారు.

# చిన్నగార్లపాడు కు చెందిన అన్నపరెడ్డి పవన్ కుమార్ రెడ్డి కు సమాజ సేవ రత్న అవార్డు

**– అవార్డును అందజేసిన ఢిల్లీ పబ్లిక్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్**

**కారంపూడి, మేజర్ న్యూస్ :** కారంపూడి మండలం చిన్న గార్లపాడు గ్రామానికి చెందిన అన్నపురెడ్డి పవన్ కుమార్ రెడ్డి కు సమాజ సేవ రత్న అవార్డు లభించింది. శనివారం ఢిల్లీ పబ్లిక్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఈ అవార్డును అందుకున్నారు. అన్నపురెడ్డి పవన్ కుమార్ చేస్తున్న సేవా కార్యక్రమాలకు ఈ అవార్డు దక్కిందని తెలుస్తుంది. ఎప్పుడు సమాజ సేవలో ముందు ఉండే పవన్ కుమార్ రెడ్డికి అవార్డు రావడం ఎంతో గర్వకారణం అని చిన్నగార్లపాడు గ్రామస్తులు ఆనంద వ్యక్తం చేస్తున్నారు. పవన్ కుమార్ రెడ్డి చిన్ననాటి నుంచి సమాజంలో ఒక వ్యక్తి ఎదుగుదలతో పాటు ఎదుటివారికి సహాయం చేసే గుణం కూడా ఉండటంతో ఈ అవార్డు ఆయనకు దక్కిందని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అవార్డు అందుకున్న అన్నపురెడ్డి పవన్ కుమార్ రెడ్డిని కారంపూడి మండలం కు చెందిన ప్రజా ప్రతినిధులు చిన్న గార్లపాడు గ్రామస్తులు అభినందిస్తున్నారు. ప్రస్తుతం పవన్ కుమార్ రెడ్డి లండన్ లో ఉంటున్నారు.



# కేరళ ప్రతినిధి బృందానికి ప్రకృతి వ్యవసాయం పై శిక్షణ



**గుంటూరు, మేజర్ న్యూస్:** ప్రకృతి వ్యవసాయం వాతావరణ సంక్షోభానికి సమర్థవంతమైన పరిష్కారాలను అందిస్తుందని, వివిధ రకాల పంటలతో ఏడాది పొడవునా నేలను పచ్చదనంతో కప్పి ఉంచడం వల్ల వాతావరణంలో భారీ మార్పులు చోటుచేసుకొంటాయని రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి. విజయ్‌కుమార్ పేర్కొన్నారు. నాలుగు రోజులపాటు కేరళ బృందానికి జరిగే ప్రకృతి వ్యవసాయ శిక్షణా కార్యక్రమం శనివారం గుంటూరులోని ఒక ప్రైవేట్ హోటల్‌లో ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో కేరళ రాష్ట్రం నుండి వ్యవసాయ విశ్వవిద్యాలయాల శాస్త్రవేత్తలు, కృషి విజ్ఞాన కేంద్రాల నిపుణులు, రైతు మెంటర్ ట్రైనర్లతో కూడిన 34 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. శనివారం నుండి 29 వ తేదీ వరకు జరగనున్న ఈ కార్యక్రమాన్ని జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ లో భాగంగా "సెంటర్ ఆఫ్ నేచురల్ ఫార్మింగ్" గా గుర్తించబడ్డ (ఇండో-జర్మన్ గ్లోబల్ అకాడమీ ఫర్ అగ్రోఎకాలజీ రీసెర్చ్ అండ్ లెర్నింగ్) ఆధ్వర్యంలో హైదరాబాద్ సహకారంతో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా టి. విజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం బయాలజికల్ ప్రాసెస్‌లపై ఆధారపడి, పోషకాలు, నీటి చక్రం, మొక్కల శారీరక శాస్త్రం మరియు కలుపు నియంత్రణలో శాస్త్రీయ పరిష్కారాలను అందిస్తుంది అన్నారు. "ప్రకృతి వ్యవసాయం రసాయనాలు లేకుండా చేయడం వల్ల 365 రోజులపాటు హరిత కవచంతో బహుళ పంటల సాగు, ఫోటోసింథసిస్ ఆప్టిమైజేషన్ ద్వారా వాతావరణ మార్పుల సంక్షోభాన్ని ఎదుర్కొనే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఐ.ఏ.ఎస్ అధికారి ఎస్.ఎం. విజయానంద్ వర్చువల్‌గా మాట్లాడుతూ రాష్ట్రాల మధ్య జ్ఞాన మార్పిడి ద్వారా స్థిరమైన, స్నేహపూర్వక వ్యవసాయ పద్ధతులను అవలంబించడంలో కేరళ నిబద్ధతను పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో ప్రయాణం, భూసార సంరక్షణ, వరద నిరోధకత, సుస్థిర పంట ఉత్పత్తిలో ప్రకృతి వ్యవసాయ పాత్రను రైతు సాధికార సంస్థ అధికారులు వివరించారు. రైతు సాధికార సంస్థ సలహాదారులు రిటైర్డ్ ఐ.ఏ.ఎస్ అధికారి డి.వి. రాయుడు మాట్లాడుతూ బహుళ పంటల సాగు వ్యవస్థలు కార్బన్ ఉద్గారాలను తగ్గించి, నేల నిర్మాణాన్ని మెరుగుపరచి, జీవ వైవిధ్యాన్ని పెంపొందిస్తాయి అని తెలిపారు. ఈ సందర్భంగా వివిధ ప్రకృతి వ్యవసాయ మోడళ్ల ప్రాముఖ్యతను మరియు విస్తరణ అవసరాన్ని ప్రస్తావించారు. రైతు సాధికార సంస్థ సీనియర్ అధికారులు సుధాకర్, జి.ఆర్. ధర్మేందర్, కె. రామచంద్రం తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# విద్యుత్ రంగం ప్రైవేటీకరించే కుట్రలో భాగమే స్మార్ట్ మీటర్ల బిగింపు: సిపియం




గుంటూరు, మేజర్ న్యూస్ : విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించే కుట్రలోభాగంగా రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు బిగించే ప్రయత్నాన్ని విరమించుకోవాలని లేనిచో దశల వారీగా ఆందోళనకు పూనుకుంటామని సిపియం కేంద్ర కమిటీ సభ్యులు డి.రమాదేవి అన్నారు. నేడు 2/7 బ్రాడిపేటలోని సిపియం జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డి.రమాదేవి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు తాము అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు తగ్గిస్తామని, ట్రూఅప్ ఛార్జీలు, సర్దుబాటు ఛార్జీలు రద్దు చేస్తామని హామీ ఇచ్చారు. స్మార్ట్ మీటర్లు పెడితే పగలగొట్టమని లోకేష్ పాదయాత్రలో చెప్పారని, నేడు స్మార్ట్ మీటర్లు బిగించడం ఏమిటని ప్రశ్నించారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాపితంగా వివిధ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్న ఆందోళనకు సిపియం సంపూర్ణ మద్దతు తెలుపుతుందన్నారు. కేంద్రంలో బి.జె.పి అధికారంలోకి వచ్చాక నిత్యజీవితావసర సరుకులు, పెట్రోలు, డీజిల్, వంట గ్యాస్ ధరలు పెరిగిపోయాయని, ప్రజలకు ఉపాధి దొరకడం లేదన్నారు. ఫలితంగా ప్రజల జీవన ప్రమాణాలు తగ్గాయన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపు నిచ్చారు.

సిపియం రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యులు సి.హెచ్.బాబురావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రాజధాని నిర్మాణానికి చట్టబద్ధత కల్పించాలని, 29 గ్రామాలలోని రాజధానిని అభివృద్ధికి ప్రాధాన్యత నిచ్చి అభివృద్ధి చేయాలని, ప్రజలకు ఉపాధి కల్పించే చర్యలు చేపట్టాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అస్తి పన్ను పెంపుకు ప్రణాళిక రూపొందించి అమలు జరుపుతుందని దీనికి వ్యతిరేకించాలని కోరారు. గృహవినియోగదారులకు స్మార్ట్ మీటర్లు బిగిస్తే ప్రతి ఘటించాలని పిలుపునిచ్చారు. సిపియం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ మాట్లాడుతూ జిల్లాలో నల్లబర్లీ పొగాకు కొనగోలు కేంద్రాలు పెంచి రైతుల వద్ద వున్న మొత్తం పొగాకును కొనుగోలు చేయాలని, జిల్లాలోను, మంగళగిరి నియోజకవర్గంలోను, ప్రభుత్వ భూముల్లో ఇళ్ళు వేసుకుని నివాసముంటున్న పేదలకు ఇళ్ళ పట్టాలు, అర్హులైన పేదలకు ఇళ్ళ స్థలాలు ఇవ్వాలన్నారు. గుంటూరు ఛానల్‌ను ప్రత్తిపాడు వరకు పొడిగించేందుకు, నల్లమడ ఆధునీకరణకు నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలని కోరారు. జిల్లాలో అస్తవ్యస్తంగా వున్న రోడ్లు, డ్రైనేజీ, వ్యవస్థలను మెరుగుపర్చాలని కోరారు. ఈ సమావేశంలో సిపియం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారావు, కె.నళినీకాంత్, ఎమ్.రవి, బూరుగ వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు డి.శ్రీనివాసకుమారి, ఎల్.అరుణ, వి.జవహర్‌లాల్, కె.అజయ్‌కుమార్, డి.లక్ష్మీనారాయణ, ఎమ్.ఎ. చిష్టీ, యు.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి చోటా.. అభివృద్ధికి బాట... సంక్షేమాన్ని ప్రతి గుమ్మానికి చేర్చాం

మొదటిపేజీ తరువాయి

కలిసి ఎమ్మెల్యే నసీర్ పర్యటించారు. తమ వార్డు అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు కేటాయించి, ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్న ఎమ్మెల్యే నసీర్ రాకతో ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు ఆనంద్ బాబు, నసీర్ కు ఘన స్వాగతం పలికారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అర్హులకు సక్రమంగా అందుతున్నాయా ? లేవా ? అని అడిగి తెలుసుకున్నారు. ఆ ప్రాంత అధికారులతో మాట్లాడి అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు చేరువ కావాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు నసీర్, నక్కా ఆనంద్ బాబు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అన్ని ప్రాంతాలను నిర్వీర్యం చేశారని, అభివృద్ధికి ఆమడదూరంలో నిలిపారని విమర్శించారు. ప్రజలకు అవసరమైన కనీస వసతులు కల్పించకుండా తీవ్ర ఇబ్బందులు పెట్టారని తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం విజన్ తో ముందుకు వెళుతోందని చెప్పారు. అందులో భాగంగా అన్ని కాలనీలు ప్రగతి బాటలో పరుగులు తీస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో చట్టబత్తిని చిట్టిబాబు, కార్పొరేటర్ ఎలావుల అశోక్, డివిజన్ అధ్యక్షులు కన్నెబోయిన సాయి, పున్నయ్య, గూడూరు వాసు, కందుకూరి వెంకట్, ప్రభాకర్, దాసరి గౌతమ్, నాగేశ్వరరావు, వీర్రాజు, పగడాల గోపి, ఫణి, నరసింహ, సునీత, చంద్రకాంత్, సాయి, గోపీచంద్ తదితరులు పాల్గొన్నారు.

# గుంటూరు ఎన్టీఆర్ బస్టాండ్‌లో ప్రయాణికులు తస్మాత్ జాగ్రత్త

మొదటిపేజీ తరువాయి

వచ్చిన తరువాత చూసుకొని చిల్లర తగ్గటం గమనించి షాప్ వారిని అడిగేందుకు బస్సు దిగి వెళ్లాడు. వారు మరలా తరువాత బస్సు వచ్చే వరకు వేసి ఉండాల్సిన పరిస్థితి షాపు ల వారి మోసం వల్ల తరచూ ఇలాంటి పరిస్థితులు ఏర్పడుతున్నాయి. గతంలో పొన్నూరు కు చెందిన ఒక వ్యక్తి కూడా ఇదేవిధంగా షాపులో గొడవలు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. . బస్సు స్టాండ్ లో నిత్యం అధికారులు తిరుగుతున్నా ఇలాంటి ఆక్రమాలను మాత్రం షాపుల వాళ్లు ఆపటం లేదు. ఆర్టీసీ అధికారులకు గతంలో ఇలాంటి ఫిర్యాదులు అందిన, ఎవరు పట్టించుకోవటం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. డబ్బుల కొరకు బస్సు స్టాండ్లులో విచ్చలవిడిగా షాపులు ఏర్పాటు చేయటంపై ప్రయాణికులు పెదవి విరుస్తున్నారు. ఎంర్ పి ధరల కంటే అధిక ధరలకు వస్తువులు అమ్ముతూ చిల్లర ఇచ్చే సమయాలలో ప్రయాణికుల కు తగ్గించి ఇవ్వటం పై ప్రయాణికులు ఆగ్రహం య్యక్తం చేస్తున్నారు. ఇక నైనా ప్రయాణికులు బస్టాండ్ షాపులలో చిల్లర తీసుకొనే సమయాలలో జాగ్రత్త గా ఉంటే మంచిది.

## అసెంబ్లీ మైనారిటీ కమిటీ చైర్మన్ గా నసీర్

మొదటిపేజీ తరువాయి

చెప్పారు. మైనారిటీ జీవన ప్రమాణాలు పెంచేందుకు, ఆర్థిక ప్రగతి సాధించేందుకు అసెంబ్లీ వేదికగా చర్యలు తీసుకుంటానని స్పష్టం చేశారు.

# మేజర్ డ్రైన్ లపై ఆక్రమణలు తొలగించాలి: కమిషనర్ ఆదేశం



**గుంటూరు.నగరపాలక సంస్థ, మేజర్ న్యూస్ :** నగర పాలక.సంస్థ పరిధిలో ప్రధాన రోడ్ల వెంబడి, మేజర్ డ్రైన్లపైన ఆక్రమణలు ఉండడానికి వీలులేదని, పట్టణ ప్రణాళికాధికారులు ఆక్రమణల తొలగింపుపై ప్రత్యేక దృష్టిసారించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. శనివారం బస్టాండ్ రోడ్, నందివెలుగు రోడ్లను పరిశీలించి, యదేశ్చగా రోడ్, డ్రైన్ ఆక్రమణలు ఉండడంపై పట్టణ ప్రణాళిక అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసి, ఆక్రమణల తొలగింపు చేపట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో విచ్చలవిడిగా రోడ్లు, డ్రైన్ల ఆక్రమణలు చేసి ట్రాఫిక్, మురుగుపారుదలకు ఆటంకంగా మారాయన్నారు. ఇప్పటికే శంకర్ విలాస్ వంతెన పనులు ప్రారంభం అయినందున నగరంలో ట్రాఫిక్ సమస్యలు వచ్చే అవకాశం ఉందని, రోడ్ ఆక్రమణలను ఉపేక్షించబోమన్నారు. ఆక్రమణల తొలగింపుకు పట్టణ ప్రణాళికాధికారులు బాధ్యత తీసుకోవాలని, దళం వాహనాలను రాత్రి సమయాల్లో కూడా నగరంలోని ప్రధాన వీధుల్లో అందుబాటులో ఉంచి ఆక్రమణలను గుర్తిస్తే తొలగించాలని ఆదేశించారు. ఆక్రమణల తొలగింపులో అధికారులు అలసత్వం ప్రదర్శించరాదని, నిర్లక్ష్యంగా ఉండే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రస్తుతం వర్షాలకు ఆక్రమణల వలన డ్రైన్లు పొంగి ఇళ్లలోకి మురుగు వస్తుందని, స్థానిక ప్రజా ప్రతినిధులు, ప్రజలు, వ్యాపార వాణిజ్య సంస్థలు కూడా ఆక్రమణల తొలగింపుకు సహకరించాలని కోరారు. పర్యటనలో ఈఈ సుందర్రామిరెడ్డి, డిఈఈలు నాగభూషణం, హనీఫ్, ఎంహెచ్ఓ (ఇంచార్జి) రామారావు, కార్పొరేటర్ మహమూద్, ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

# వెటర్నరీ డాక్టర్ల ఇష్టారాజ్యం..!

**నేటి దినపత్రిక సూర్య, పల్నాడు /గుంటూరు జిల్లా బ్యూరో:** ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో పశువులకు సూది ఇచ్చేది లేదు. సీనియర్ వెటర్నరీ డాక్టర్లు నెలకు రూ.లక్షల్లో వేతనం అందుకుంటున్నారు. జిల్లాల లోని వెటర్నరీ డాక్టర్లలో 50-60% మంది సరిగ్గా విధులకు హాజరుకాకుండా, నెలల తరబడి దుమ్మా కొడుతున్నారనే ఆరోపణలున్నాయి. కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారంలో, మరికొందరు ఇతర బిజినెస్‌ల్లో మునిగితేలుతున్నారనే విమర్శలున్నాయి. ఈ తంతు ముఖ్యంగా పల్నాడు, గుంటూరు జిల్లాల్లో అత్యధికంగా ఉన్నట్లు తెలిసింది. పల్నాడు ప్రాంతానికి చెందిన ఒక వెటర్నరీ డాక్టర్ హాస్పిటల్ కు రాకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నట్లు తెలిసింది. అలాగే గుంటూరు జిల్లా కు చెందిన మరొక డాక్టర్ దవాఖానాకు రాకుండా సొంత వ్యాపారాలు చేస్తున్నట్లు సమాచారం. ఇదే పంథాలో మరికొందరు పశు వైద్యశాల డాక్టర్లు ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. పై అధికారులు లేదంటే జిల్లా అధికారులు అది కూడా కాకపోతే రాజకీయ నాయకుల అండదండలు ఈ వెటర్నరీ డాక్టర్ల కు మెండుగా ఉన్నట్లు వార్తలు వినవస్తున్నాయి.

**విధులకు దుమ్మా కొడుతున్న డాక్టర్లు.**

పలు ఆసుపత్రులలోని కొందరు వైద్యులు జిల్లా అధికారులకు ప్రతి నెలా ఇంత అని ముట్టజెప్పుతున్నట్లు ఆరోపణలున్నాయి. దీంతో అధికారులు కూడా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని, విధులకు రాకపోయినా పట్టించుకోవడం లేదని సమాచారం. దీంతో దుమ్మా కొడుతున్న డాక్టర్లకు ప్రతి నెలా రంచనుగా జీతం అందుతుండటం కొసమెరుపు. పశువులకు వేయాల్సిన వివిధ రకాల వ్యాక్సినేషన్, మందులు, తదితర వాటిని కూడా పక్కదారి పట్టిస్తున్నట్టు అనేకమంది రైతులు ఆరోపిస్తున్నారు. ఇక ఆసుపత్రుల్లో పనిచేసే సిబ్బంది గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. కాసులు చేతిలో పెడితే అక్రమాన్ని సక్రమం చేస్తున్నట్లు చెబుతున్నారు. పశు వైద్యశాలలో డాక్టర్లు విధులు సరిగ్గా నిర్వర్తించక పోవడంతోనే ఈ సమస్యలు తలెత్తుతున్నాయని అంటున్నారు. ఏదో తూతూ మంత్రంగా వైద్యం చేసేసి, రికార్డుల్లో దొంగ లెక్కలు నమోదు చేసి మిగిలిన వ్యాక్సిన్లను చెత్తపాలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

# ఘనంగా ప్రగడ కోటయ్య110వ జయంతి వేడుకలు



**మంగళగిరి, మేజర్ న్యూస్:** నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ప్రముఖ జాతీయ ఉద్యమ నాయకుడు, చేనేత పరిశ్రమ రక్షణ కోసం పోరాటం చేసిన యోధులు ప్రగడ కోటయ్య 110 వ జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ దొంతిరెడ్డి వేమారెడ్డి తదితరులు ప్రగడ కోటయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు మాట్లాడుతూ చేనేత ముద్దుబిడ్డ, గొప్ప వ్యక్తి అయినటువంటి ప్రగడ కోటయ్య జయంతి వేడుకల్లో పాల్గొనడం చాలా ఆనందంగా ఉందని, ఆయన జీవితం మొత్తం చేనేత పరిశ్రమ కోసం, చేనేతల కోసం ఎంతో శ్రమించా రని కొనియాడారు. నియోజకవర్గ వైఎస్ఆర్సీపీ ఇంచార్జ్ వేమారెడ్డి మాట్లాడుతూ స్వర్గీయ ప్రగడ కోటయ్య చేనేత రంగానికి తన జీవితాన్ని ధార పోశారని, అప్పట్లో ప్రభుత్వాలు కూడా చేనేతలకు, చేనేత రంగానికి ఎలా సహకరించాలో, ఎలా ఆదుకోవాలనే విషయాలపై సలహాలు ఇచ్చినంత మహా మేధావి కోటయ్య అని కొనియాడారు. దేశంలో వ్యవసాయ రంగం తరువాత అంత పెద్ద స్థాయిలో ఆధారపడి జీవనం సాగిస్తున్న రంగం చేనేత రంగమని, అటువంటి చేనేత రంగం చేనేత శ్రామికులు నేడు కొన్ని ఫలాలు అనుభవిస్తున్నారంటే అది ప్రగడ కోటయ్య చేసిన కృషి అన్నారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మునగాల మల్లేశ్వరరావు, ఆకురాతి రాజేష్, ఊట్ల పాల శ్రీనివాసరావు, గంజి షణ్ముక్, సయ్యద్ గౌస్ మొహిద్దిన్, షేక్ గౌస్, ఆర్దల చిన్నారి యాదవ్, జంగా నాగిరెడ్డి, భీమిరెడ్డి చరణ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

# కెఎల్‌యులో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం



**మంగళగిరి, మేజర్ న్యూస్:** వడ్డేశ్వరం కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ పూర్వ విద్యార్థుల విభాగం ఆధ్వర్యంలో ప్రతిష్ఠాత్మకంగా పూర్వ విద్యార్థుల దశాబ్ద కలయిక – 2015 బ్యాచ్ కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రపంచవ్యాప్తంగా ఉన్న సుమారు 130 మంది పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి వర్సిటీ రిజిస్ట్రార్ డా. కె. సుబ్బారావు ముఖ్య అతిథిగా పాల్గొనగా, కార్యక్రమ కన్వీనర్ డా. కె. సిహెచ్. శ్రీ కావ్య, కో–కన్వీనర్ డా.కె. సోని, కొంతమంది పూర్వ విద్యార్థులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి భక్తిగీతంతో ప్రారంభించారు. తరువాత డా. శ్రీ కావ్య సభను ఉద్దేశించి ప్రసంగిస్తూ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పూర్వ విద్యార్థులు ఈ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. యూనివర్సిటీలో కృత్రిమ మేధస్సు (ఎఐ) ఆధారిత అభివృద్ధి ఎలా జరుగుతుందో వివరించారు. భవిష్యత్తులో విద్యా రంగానికి అవసరమైన కార్యాచరణను అమలు చేస్తామని చెప్పారు. కెఎల్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డా. కె. సుబ్బారావు మాట్లాడుతూ వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోయినప్పటికీ పూర్వ విద్యార్థులు హాజరైనందుకు హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఆ రోజుల్లో పూర్వ విద్యార్థుల జ్ఞాపకాలను పునఃస్మరించుకుంటూ, ప్రస్తుత యూనివర్సిటీ అభివృద్ధిని వివరించారు. పూర్వ విద్యార్థుల అభివృద్ధికి ఎప్పుడూ సాయంగా నిలబడతామని హామీ ఇచ్చారు. కొంతమంది పూర్వ విద్యార్థులు తమ కాలేజీ రోజులను స్మరించుకుంటూ, యూనివర్సిటీ తమ జీవితాల్లో ఎలా సహాయపడిందో పంచుకున్నారు. తరువాత ప్రస్తుత విద్యార్థులు, పూర్వ విద్యార్థులు కలిసి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ఆనందోత్సాహాలతో గడిపారు. అనంతరం పూర్వ విద్యార్థులకు జ్ఞాపికలను అందజేశారు. తరువాత పూర్వ విద్యార్థులు అందరు క్యాంపస్ ను సందర్శించి, తమ పాత అధ్యాపకులను కలసి ఆనాటి జ్ఞాపకాలను పంచుకున్నారు.

# సత్తెనపల్లిలో కార్గిల్ విజయ్ దివస్ వేడుకలు




**సత్తెనపల్లి మేజర్ న్యూస్:** పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గవర్నమెంట్ ఆఫ్ ఇండియా మై భారత్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్.. మేర యువ భారత్ గుంటూరు (మై భారత్) వారి సౌజన్యంతో హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివస్ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిపార్ట్మెంట్ సర్కిల్ ఇన్స్పెక్టర్ పి. విజయ్ కుమార్ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ భారత సైనిక చరిత్రలో అత్యంత ముఖ్యమైన విజయాలలో ఒక దానికి గుర్తుగా ప్రతి సంవత్సరం జూలై 26 ను కార్గిల్ విజయ్ దివస్ గా జరుపుకుంటామని, 2025 లో 1999 కార్గిల్ యుద్ధంలో విజయం సాధించి 26వ వార్షికోత్సవాన్ని భారతదేశము ఘనముగా జరుపుకుంటుందని తెలియజేశారు. ఈ పోరాటం దాదాపు రెండు నెలలు కొనసాగి కెప్టెన్ విక్రమ్ భాత్ర వంటి ప్రఖ్యాత వీరులతో సహా 500 మందికి పైగా భారతీయ సైనికులు దేశం కోసం త్యాగం చేశారని, వారి త్యాగము మరువలేనిదన్నారు. అనంతరం కొంతమంది రిటైర్డ్ ఆర్మీ సిబ్బంది విజయ్ కుమార్ నందిగామ గ్రామం (20 సంవత్సరాలు), షేక్ మొహమ్మద్ ఆయుబ్ సత్తెనపల్లి (18 సంవత్సరాలు), ఎం పుల్లయ్య మార్కాపురం (15 సంవత్సరాలు) ఆర్మీలో పనిచేసి రిటైర్డ్ అయిన వారికి సన్మానాలు చేయడం జరిగింది. కార్యక్రమానికి ముందుగా ఇటీవల దేశం కోసం ప్రాణాలను అర్పించిన యువతేజం మురళి నాయక్ చిత్రపటానికి నివాళులర్పించడం జరిగింది. కార్గిల్ విజయ్ దివాస్ పై విద్యార్థిని విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి, ఆ పోటీలలో ఆరుగురికి బహుమతులు ఇవ్వడం జరిగింది. విద్యార్థులతో జాతీయ జెండాలతో ర్యాలీ, మొక్కలు నాటడం జరిగింది. ఈ కార్యక్రమంలో హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కంచర్ల బుల్లిబాబు ప్రభుత్వ గవర్నమెంటు జూనియర్ కాలేజీ ఇన్చార్జి ప్రిన్సిపల్ శ్రీలక్ష్మి, స్కిల్ హబ్ ట్రైనింగ్ సెంటర్ ఇన్చార్జి కృష్ణారెడ్డి, టీచర్ మస్తాన్ ఐటిఐ కాలేజ్ ప్రిన్సిపల్ ఎన్ రమేష్, శ్రావణి, మీరాబి విద్యార్థులు పాల్గొన్నారు.

# లగడపాడులో ప్రగడ కోటయ్య 111వ జయంతి వేడుకలు



**పెదకూరపాడు మేజర్ న్యూస్ :** స్వాతంత్ర్య సమరయోధులు, చేనేత ఉద్యమ సూరీడు, మాజీ రాజ్యసభ సభ్యులు, కీర్తిశేషులు ప్రగడ కోటయ్య 111వ జయంతి లగడపాడు గ్రామంలో భావన ఋషి దేవాలయం వద్ద చేనేతలు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. చిల్లపల్లి సత్యం పాల్గొని ప్రగడ కోటయ్య ఆశయాలు, వారి సేవలు కొనియాడారు. పెదకూరపాడు నియోజక వర్గ పద్మశాలి సంక్షేమ సంఘం అధ్యక్షుడు చెన్నంశెట్టి బాజీ, పెదకూరపాడు నియోజక వర్గం జాతీయ చేనేత ఐక్య వేదిక సంఘం అధ్యక్షుడు గోలి యల్లమందయ్య, పిడిఎఫ్ కన్వీనర్, ప్రజా కవి, దర్శి శేషారావులు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేనేత బిడ్డగా తన తుదిశ్వాస వరకు దేశంలోని చేనేత ప్రజల సంక్షేమం కోసం చేనేత కార్మికులు, చేనేత పరిశ్రమ కోసం నిరంతరం తపించి, ప్రభుత్వాలతో పోరాడిన పోరాట యోధుడు ప్రగడ కోటయ్య అని కొనియాడారు. 3 సార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది, ఒకసారి శాసనమండలి సభ్యులుగా, రాజ్యసభ సభ్యులుగా చట్టసభల్లో చేనేత హక్కుల కోసం తన గళాన్ని వినిపించిన నేత ప్రగడ కోటయ్య అని అన్నారు. ఆయన లేని లోటు తీర్చలేనిదని ఆయన ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయన్నారు. చేనేతల కోసమే నిరంతర యుద్ధం చేసిన యోధుని జన్మదినోత్సవం సందర్భంగా ప్రజలందరూ ఆయనను గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అనుముల వెంకట్రావు, బండారు వెంకటేశ్వర్లు, సామ్రాజ్యం, రామారావు, సంగెపు శ్రీను, పద్మశాలి ప్రముఖులు పాల్గొన్నారు.



## సంపన్నులు మానవతా ధృక్పథంతో పీ-4లో భాగస్వాములు కావాలి : ప్రత్తిపాటి




**చిలకలూరిపేట, మేజర్ న్యూస్ :** ముఖ్యమంత్రి మానసపుత్రిక పీ–4 పథకం... పేదల్ని ఆర్థికంగా స్థితిమంతుల్ని చేయాలన్న ధృడ చిత్తంతోనే ఆయన మార్గదర్శుల సేవల్ని కోరుతున్నారని, సంపన్నులు మానవతా ధృక్పథంతో పేదలసేవలో భాగస్వాములు కావాలని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పిలుపునిచ్చారు. శుక్రవారం రాత్రి పట్టణంలోని 25, 26, 27, 28,29 వార్డుల్లో ఆయన సుపరిపాలనలో తొలి అడుగు : ఇంటింటికీ తెలుగుదేశంలో పాల్గొన్నారు. ప్రజలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్న ప్రత్తిపాటి.. ప్రాధాన్యత క్రమంలో ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. గత పాలకుల విధ్వంసంతో కోలుకోలేని విధంగా దెబ్బతిన్న రాష్ట్రాన్ని ఏడాదిలో చంద్రబాబు గట్టెక్కించారని, ఇంకా అభివృద్ధి దిశగా పరుగులు పెట్టించే దిశగా పాలన సాగిస్తున్నారని ప్రత్తిపాటి చెప్పారు. త్వరలోనే ప్రభుత్వం కొత్త పింఛన్లు మంజూరు చేయనుందన్న ప్రత్తిపాటి.. భర్తల్ని పోగొట్టుకున్న ప్రతి వితంతువుకి పింఛన్ అందుతుందన్నారు. ఆగస్ట్ 15 నుంచి ప్రారంభమయ్యే ఉచిత బస్సు ప్రయాణాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ప్రత్తిపాటి సూచించారు. యువతకు ఉపాధే లక్ష్యంగా పలుకంపెనీలతో ఒప్పందాలు.. పెట్టుబడులు సాధన దిశగా ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోందన్నారు. త్వరలోనే నిరుద్యోగ యువతకు నెలవారీ భృతి అందించనుందన్నారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే ఎస్సీ, ఎస్టీ యువతకు ఇప్పటికే ప్రభుత్వం ఉచిత శిక్షణను అందిస్తోందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ టీడీపీ కరీముల్లా, పిల్లి కోటి, మున్సిపల్ కమిషనర్ పతి శ్రీహరి బాబు తదితరులు పాల్గొన్నారు.

## గుంటూరులో జోయాలుక్కాస్ వారి 'బ్రిలియెన్స్ డైమండ్ జ్యువలరీ షో'


**గుంటూరు, మేజర్ న్యూస్:** జోయాలుక్కాస్ వారి ప్రతిష్ఠాత్మకమైన బ్రిలియెన్స్ డైమండ్ జ్యువలరీ షో గుంటూరులో 2025 జులై 26 న ప్రారంభించారు. ఈ ప్రసిద్ధి చెందిన ఎగ్జిబిషన్ ఉత్తమమైన డిజైన్ మరియు స్టైల్ ను సంబరం చేస్తోంది, ప్రత్యేకమైన డైమండ్ మరియు విలువైన జ్యువలరీని అన్వేషించడానికి విలక్షణమైన అవకాశాన్ని అందిస్తోంది. బ్రైడల్ రూపకల్పనల నుండి తప్పనిసరిగా ఉండవలసిన సమకాలీన ఆభరణాలు వరకు, షోలో ఉన్న ప్రతి ఆభరణం ఏదైన ఒక ప్రత్యేకమైనది అందించడానికి రూపొందించబడింది. ఈ పరిమిత ఎడిషన్ డిజైన్లు కేవలం ఎగ్జిబిషన్ ఉన్న సమయంలోనే లభిస్తాయి. డాక్టర్. జాయ్ అలుక్కాస్, జోయాలుక్కాస్ గ్రూప్ చైర్మన్ ఇలా అన్నారు " మేము గుంటూరుకు బ్రిలియెన్స్ డైమండ్ జ్యువలరీ షోను తీసుకురావడానికి ఆనందిస్తున్నాము. ఇది జ్యువలరీలో గొప్ప అభిరుచి కలిగిన గమ్యస్థానం మరియు ఆ ఆధునికత & స్టైల్ ని సూచించే కలక్షన్ ను మేము సృష్టించాము. ఇది అందం, భావోద్వేగం మరియు వ్యక్తిత్వాలను ప్రదర్శిస్తుంది."

ఒక ప్రత్యేకమైన ఆఫర్ గా, కస్టమర్లు ప్రదర్శనలో రూ. 1 లక్ష మరియు ఎక్కువ విలువ చేసే ప్రతి డైమండ్ జ్యువలరీ కొనుగోలుతో ఉచితంగా 1 గ్రాము గోల్డ్ కాయిన్ ను అందుకుంటారు. ఎగ్జిబిషన్ జోయాలుక్కాస్ గుంటూరు షోరూంలో జరుగుతుంది మరియు ఆగస్ట్ 10వ తేదీ వరకు మాత్రమే అందుబాటులో ఉంటుంది కాబట్టి ఈ అవకాశం కోల్పోవద్దని కోరారు.



## తల్లికి వందనం పై విమర్శలు ..!

– ప్రభుత్వం సీరియస్




**గుంటూరు, మేజర్ న్యూస్ :** ఏపీలో కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథకం అమలు చేయడం ద్వారా ఈ ఏడాది మంచి మార్కులే సంపాదించుకుంది. గతంలో అమ్మఒడి పేరుతో జగన్ అమలు చేసిన పథకానికి మెరుగులు దిద్ది ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికీ ఏడాదికి 13 వేల చొప్పున ఇచ్చేలా దీనికి మార్పులు చేశారు. గతేడాది అమలు చేయలేకపోయినా ఈ ఏడాది దాదాపు 10 వేల కోట్లు ఖర్చు పెట్టి ఈ పథకాన్ని అమలు చేసింది కూటమి సర్కార్. అయితే ఇంత చేసిన ఓ విషయంలో మాత్రం విమర్శలు తప్పడం లేదు. రాష్ట్రంలో లక్షల మంది పిల్లలకు తల్లికి వందనం పథకం అమలు చేశామని ప్రభుత్వం చెప్పుకుంటున్నా 9, 10, ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాలు చదువుతున్న ఎస్సీ విద్యార్థులు 3.93 లక్షల మందికి ఈ పథకం పూర్తి స్దాయిలో అమలు కాలేదు. కేంద్రం నుంచి వచ్చే స్కాలర్ షిప్ మొత్తాల్ని మినహాయించి మిగిలిన నిధుల్ని రాష్ట్ర ప్రభుత్వం వీరికి జమ చేసింది. దీంతో విద్యార్థులకు 5 వేల నుంచి 12 వేల రూపాయల మధ్య మొత్తాలే క్రెడిట్ అయ్యాయి. దీంతో వివాదం మొదలైంది. తల్లికి వందనం పథకాన్ని ప్రభుత్వం ఎస్సీ విద్యార్థులకు అమలు చేయకుండా మోసం చేసిందంటూ వైసీపీ అనుకూల మీడియా, సోషల్ మీడియా, డిజిటల్ మీడియా హ్యాండిల్స్ లో వార్తలు కనిపిస్తున్నాయి. దీంతో ఈ వ్యవహారం ప్రభుత్వానికి తలనొప్పిగా మారింది. దీనిపై స్పందించిన ప్రభుత్వం ఇప్పటికే ఫ్యాక్ట్ చెక్ ద్వారా ఇలా తల్లికి వందనం పథకంలో మొత్తం డబ్బులు రాని వానికి 20 రోజుల్లో కేంద్రం విడుదల చేసే నిధులు జమ అవుతాయని, దీంతో మొత్తం 13 వేలు లభిస్తాయని వివరణ ఇస్తోంది. దీంతో కేంద్రం నిధులు వస్తాయో రావో తెలియక ఎస్సీ విద్యార్థుల్లోనూ అయోమయం నెలకొంది.

# ఉపాధ్యాయులపై బోధనేతర పనుల భారం తగ్గించాలి

**నరసరావుపేట మేజర్ న్యూస్ :** విద్యా సంవత్సరం ప్రారంభమైన నాటి నుండి ఉపాధ్యాయులు బోధనకంటే బోధనేతర పనులకే ఎక్కువ సమయం కేటాయించవలసి వస్తున్నది. ముఖ్యంగా యోగాంధ్ర, మెగా పేరెంట్ టీచర్స్ సమావేశం, శిక్షణా తరగతులు పేరుతో అనేక కార్యక్రమాలు ఉపాధ్యాయులను బోధనకు దూరం చేసాయి. ఇవి కాకుండా ప్రతీరోజూ ఏదో ఒక సమాచారం విద్యాశాఖ అత్యవసరమంటూ యాప్లలో అప్లోడ్ చేయమంటున్నది. విద్యా కిట్లు పంపిణీ అప్లోడ్ చేయాలంటూ చేసిన ఒత్తిడి సరేసరి. ఇవికాక ఉపాధ్యాయులకు ఏ మాత్రం సంబంధంలేని '24' వంటి విషయాలు కూడా ఉపాధ్యాయులపై మోపుతున్నారు. యాప్ల భారం తగ్గిస్తామని చెబుతూనే ఒకే యాప్లో అనేక సమాచారాలు పెట్టమంటున్నారు. క్రిందిస్థాయి అధికారుల ఒత్తిడి తట్టుకోలేకున్నారు బదిలీలు గడచి నెలరోజులు గడచినా ఇప్పటికీ వేలాదిమంది ఉపాధ్యాయులు రిలీవింగ్కు నోచుకోలేదు. వేలాది పాఠశాలలు సింగిల్ టీచర్ స్కూల్సుగానే పనిచేస్తున్నాయి. పేరుకు 5గురు టీచర్లు ఇచ్చినా పలు పాఠశాలల్లో ఇద్దరే పనిచేస్తున్నారు. ఉపాధ్యాయులపై బోధనా భారం ఎక్కువగా ఉంది మరోవైపు ఉపాధ్యాయులు సెలవులు వినియోగించుకునే స్వేచ్ఛ లేకుండా ఆంక్షలు విధిస్తున్నారు. ఆప్షనల్ సెలవులు, లోకల్ సెలవులు వినియోగించుకోవడంపై ఉన్నత అధికారుల ఆంక్షలు ఉపాధ్యాయుల్లో తీవ్ర అసంతృప్తి కలిగిస్తున్నాయి. ప్రతీ పని అర్జంటుగా గంటల్లో పూర్తి చేయాలనే అధికారులు, దాదాపు 2రవేల మంది ఉపాధ్యా యులు 2 నెలలుగా జీతాలు లేకున్నా పట్టించుకోవడంపై ఉపాధ్యాయుల్లో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. బదిలీలు గడచి 45 రోజులు కావస్తున్నా బదిలీ ఉత్తర్వులలో చేసిన మార్పులపై ఇంతవరకు ఆర్థికశాఖ అనుమతి పొందకపోవడం, కేడర్



(ఫ్రెంత్, పొజిషన్ ఐడిల సమస్య పరిష్కారం కాకపోవడం, ఉపాధ్యాయుల పట్ల విద్యాశాఖ పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నదని భావన సర్వత్ర నెలకొని ఉంది ఈ నేపథ్యంలో మా యొక్క నిరసన రాష్ట్రంలోని అన్ని జిల్లా విద్యాశాఖ కార్యాలయాల ఎదుట చేపట్టం జరుగుతున్నది. కాబట్టి మా ఆందోళన గమనించి బోధనేతర కార్యక్రమాల నుండి ఉపాధ్యాయులను మినహాయించాలని, ఉపాధ్యాయులకు 2 నెలలుగా వెల్లించవలసిన జీతాల సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతున్నాము. లేని పక్షంలో ఆందోళన మరింత తీవ్రతరం చేయగలవారము అని తెలియజేస్తున్నాము.

# గుంటూరు సిజిహెచ్ఎస్‌కు నర్సింగ్ ఆఫీసర్ నియామకం

**– బాధ్యతలు స్వీకరించిన హేమా సుందరి**

**గుంటూరు, రూరల్ మేజర్ న్యూస్:** సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీమ్ (సిజిహెచ్ఎస్) గుంటూరు వెల్నెస్ సెంటర్ ఏర్పడి ఏడు సంవత్సరాలు దాటినా, అక్కడ నర్సింగ్ ఆఫీసర్ నియామకం జరగలేదని సిజిహెచ్ఎస్ లోకల్ అడ్వైజరీ కమిటీ మెంబర్ గుమ్మడి సీతారామయ్యచౌదరి స్థానిక ఎం.పి పెమ్మసాని సిఫార్సుతో కేంద్ర ఆరోగ్య శాఖ దృష్టికి తీసుకువెళ్ళారు. సీతారామయ్యచౌదరి విజ్ఞప్తిని పరిశీలించిన ప్రభుత్వం వెంటనే గుంటూరు సిజిహెచ్ఎస్ కు సీనియర్ నర్సింగ్ ఆఫీసర్ ను బి. హేమాసుందరి ని నియమిస్తూ, ఉత్తర్వులు జారీ చేసింది. శనివారం హేమా సుందరి గుంటూరు కలెక్టరేట్ ఎదురుగా గల సిజిహెచ్ఎస్ కార్యాలయంలో నూతన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎల్. ఎ .సి మెంబర్ సీతారామయ్యచౌదరి, సెంట్రల్ ఎక్సైజ్ పెన్షనర్స్ అసోసియేషన్ గుంటూరు



సర్కిల్ సెక్రటరీ కె. సామ్రాజ్యం నర్సింగ్ అధికారిణి హేమా సుందరిని శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం హేమా సుందరి మాట్లాడుతూ.. ఉద్యోగులు, పెన్షనర్ల ఆరోగ్య పరిరక్షణకు శక్తి వంచన లేకుండా వైద్య సంరక్షణ సేవలు అందిస్తానన్నారు. రోగుల చికిత్సలో డాక్టర్లకు తోడ్పాటు, రోగుల పర్యవేక్షణ, మందుల పంపిణీ, ఆరోగ్య సంరక్షణ ప్రణాళికలు అమలుకు సహాయపడటం వంటి సేవలను విస్తృత శ్రేణి నైపుణ్యంతో అందిస్తామన్నారు. ఎల్.ఎ.సి మెంబర్ సీతారామయ్యచౌదరి మాట్లాడుతూ..నర్సింగ్ సేవలలో నాణ్యత, సేవా దృక్పథం, సానుకూల ఫలితాలు వుండాలని సూచించారు. రోగుల సంరక్షణతో పాటు వారికి మద్దతు అందించాలన్నారు. నర్సుల కొరత ఉన్నప్పటికీ, గుంటూరుకు అర్హత కలిగిన గ్రూప్ ' బి 'కేడర్ కలిగిన నర్సింగ్ అధికారిణి ని నియమించడం పట్ల సిజిహెచ్ఎస్ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ రోహిణి కి కృతజ్ఞతలు తెలిపారు. తొలుత హేమా సుందరి సిజిహెచ్ఎస్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ టి.సి హెచ్. కోటేశ్వరరావు, ఎస్.ఎం.ఓ డాక్టర్ విద్యను మర్యాద పూర్వకంగా కలిసి, వారి ఆశీర్వచనం తీసుకున్నారు.

# పౌష్టికాహార కిట్లను అందజేసిన ఐ. సి.డి.ఎస్ డైరెక్టర్ పి ప్రసూన,రోటరీ అధ్యక్ష, కార్యదర్శులు నంబూరు కృష్ణమూర్తి, కే శ్రీధర్ బాబులు

**– రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహార పంపిణీ**

**గుంటూరు ఈస్ట్, మేజర్ న్యూస్:** రోటరీ క్లబ్ గుంటూరు ఆధ్వర్యంలో మాతా శిశు సంరక్షణ, ఆరోగ్య పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా శనివారం గుంటూరు నగరంలోని శారదా కాలనీలో అంగన్ వాడి కేంద్రాలలో గర్భిణీ స్త్రీలకు పౌష్టిక ఆహార కిట్లు– , పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని రోటరీ అధ్యక్ష, కార్యదర్శులు నంబూరు కృష్ణమూర్తి, కే శ్రీధర్ బాబులు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఐ. సి. డి. ఎస్ డైరెక్టర్ పి ప్రసూన గర్భిణీ స్త్రీలు తీసుకోవలసిన జాగ్రత్తలు, పుట్టే పిల్లలు చక్కని బరువుతో ఉండాలంటే పాటించ వలసిన ఆహార నియమాలు పలు ఉదాహరణలతో వివరించారు. మరొక అతిథి రోటరీ జిల్లా నాయకులు పోలిశెట్టి ప్రేమ్ కుమార్ బాలింతలకు కిట్లు– అందజేశారు. ప్రముఖ పిల్లల వైద్యులు డాక్టర్ మేకల నాగ సుధీర్ కుమార్ రెడ్డి తమ బ్లాసమ్స్ తల్లి పిల్లల వైద్య శాలలో తల్లి పిల్లలకు ఉచితంగా వైద్య సేవలు అందజేస్తామని అందుకు ఉపయోగపడే పత్రాలను అందజేశారు. రోటరీ సేవా విభాగ



బాధ్యులు కొల్లి అరవింద్, శోభానంద్ ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ ఇమేజ్ డైరెక్టర్ చదలవాడ రఘురామ్ ,రోటరీ పూర్వ అధ్యక్షులు కె.యస్. రమేష్, పబ్బిశెట్టి లక్ష్మీనారాయణ, కనమర్లపూడి రవి కిరణ్, చంద్రశేఖరన్, ఐసిడిఎస్ ప్రాంతీయ పర్యవేక్షకులు అరుణ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన దాత, ప్రముఖ ఆడిటర్ కె.వి. సుబ్బారావును అభినందించారు. ఈ సేవా కార్యక్రమంలో అధిక సంఖ్యలో గర్భిణీ స్త్రీలు, చిన్నపిల్లలు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

# వినుకొండలో జరిగే సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

**– దేశ భవిష్యత్తుకు ఆశాకిరణం ఎర్రజెండానే**

**– సీపీఐ జిల్లా కార్యదర్శి ఎ మారుతీ వరప్రసాద్**

**చిలకలూరిపేట, మేజర్న్యూస్:** తాడిత,పీడిత ప్రజానీకానికి, కార్మిక, కర్షకకులకు అండగా నిలచి, వారి సమస్యలపై పోరాడేది కమ్యూనిస్టు పార్టీ అని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎ మారుతీ వరప్రసాద్ అన్నారు. శనివారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో వినుకొండలో ఆగస్టు 7 8 తేదీల్లో నిర్వహించనున్న జిల్లా మహాసభల గోడపత్రికలను ఆయన ముఖ్య అతిథిగా హాజరై పార్టీ నాయకులతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మారుతీవరప్రసాద్ మాట్లాడుతూ వినుకొండలో ఆగస్టు 7,8 తేదీల్లో జిల్లా మహాసభలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఆగస్టు 7వ తేదీ వినుకొండ పట్టణంలో భారీ ప్రదర్శన, 8వ తేదీ ప్రతినిధుల సభ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 100 ఏళ్ల చరిత్ర ఉన్న కమ్యూనిస్టు పార్టీ భూమి కోసం, భుక్తి కోసం, ప్రజల విముక్తి కోసం, దేశ స్వతంత్రం కోసం పోరాడిందని గుర్తు చేశారు. పల్నాడు జిల్లా సమగ్ర సమక్రాభివృద్ధిలో ఎన్నో పోరాటాలు చేసి సీపీఐ ప్రజలకు బాసటగా నిలిచిందని, పేర్కొన్నారు. రాజకీయ లబ్ధి కోసం కుల మతాల మధ్య ప్రధాని మోడీ ఆధ్వర్యంలో బీజేపీ ప్రభుత్వం చిచ్చు పెడుతుందని ఆరోపించారు. కార్పొరేట్లకు కొమ్ముకాస్తూ పెత్తందారుల పక్షాన మోడీ ఊడిగం చేస్తున్నారని, కార్మిక చట్టాలను తుంగల్లో తొక్కారని మండి పడ్డారు. దేశ భవిష్యత్తుకు ఆశాకిరణం ఎర్రజెండాయేనని, రాబోయే



రోజులలో భారత కమ్యూనిస్టు పార్టీకి పూర్వ వైభవం తీసుకువచ్చేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇంచార్జి కార్యదర్శి తాళ్లూరు బాబురావు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ సుభాని,నియోజకవర్గ సహాయ కార్యదర్శి బొంతా ధనరాజ్, ఏఐటీయూసీ కార్యదర్శి దాసరి వరహాలు,గ్రామ సర్పంచ్ బొంతా తిరుపతయ్య, వేలూరు గ్రామ కార్యదర్శి ఎలికా శ్రీనివాసరావు,సహాయ కార్యదర్శి ఉట్ల వెంకటేశ్వర్లు,మాజీ ఎంపీటీసీ బొంత సుబ్బారావు,లెనిన్ శాఖ కార్యదర్శి చిరంజీవి, నాయకులు కందిమల్ల వెంకటేశ్వర్లు, చౌటుపల్లి నాగేశ్వరరావు షేక్ నన్నే,సయ్యద్ నానా,సౌటుపల్లి బాబు,బొంత నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ లాల్ బహదూర్ మున్సిపల్ హై స్కూల్‌లో ఆర్ఓ ప్లాంట్ ప్రారంభం



**నరసరావుపేట మేజర్ న్యూస్ :** నరసరావుపేట పట్టణంలోని తొమ్మిదో వార్డులో గల ప్రభుత్వ లాల్ బహదూర్ మున్సిపల్ హై స్కూల్‌లో విద్యార్థులకు స్వచ్ఛమైన మంచినీటిని అందించేందుకు నూతనంగా నిర్మించిన ఆర్ఓ ప్లాంట్‌ను శనివారం ప్రారంభించారు. ఈ ఆర్ఓ ప్లాంట్ నిర్మాణానికి డాక్టర్ శాఖమూరి బాజీ బాబు, డాక్టర్ రామచంద్ ఆర్థిక సహకారం అందించగా, దీనిని పునర్నిర్మాణం చేశారు. ఈ సందర్భంగా నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు ముఖ్య అతిథిగా పాల్గొని, "సుపరిపాలన తొలి అడుగు" కార్యక్రమంలో భాగంగా ఆర్ఓ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆయన విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ, స్వచ్ఛమైన మంచినీటి ప్రాముఖ్యతను వివరించారు. ఆర్ఓ ప్లాంట్ నిర్మాణానికి సహకరించిన డాక్టర్ శాఖమూరి బాజీ బాబు, డాక్టర్ రామచంద్‌లను ఎమ్మెల్యే అభినందించారు.కార్యక్రమంలో టీడీపీ పల్నాడు జిల్లా కార్యదర్శి అల్లంశెట్టి మోహన్ రావు, సీనియర్ నాయకులు వాసిరెడ్డి రవి, పోక రత్తయ్య, నాదేండ్ల గాంధీ, షేక్ హర్షద్, జల సూత్రం సృజన, డాక్టర్ షీర్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం విద్యార్థులకు సురక్షితమైన మంచినీటిని అందించడంలో ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది.

# పాస్టర్లు చర్చిలు క్రైస్తవుల రక్షణ కోసం పటిష్టమైన చట్టం చేయాలి

**నరసరావుపేట మేజర్ న్యూస్ :**

శనివారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు నరసరావుపేట పట్టణం పల్నాడు రోడ్ లోని బాలయ్య నగర్లో బేతేలు చర్చి నందు యుపిఎఫ్ జిల్లా కార్యవర్గం, నేషనల్ క్రిస్టియన్ బోర్డ్ జిల్లా కార్యవర్గం ల ఆధ్వర్యంలో పాస్టర్ల సమావేశం జరిగింది.



ఈ సమావేశంలో ముఖ్య వక్తగా ప్రముఖ సామాజికవేత్త, జాతీయ క్రైస్తవ, దళిత నాయకులు డాక్టర్ గోళ్ళమూడి రాజా సుందర్ బాబు పాల్గొని ప్రసంగిస్తూ, 2023 వ సంవత్సరంలో మణిపూర్ లో 65 వేల కుటుంబాలను మారణ హోమానికి గురి చేసిన సంఘటన పట్ల క్రైస్తవులు దేశం వ్యాప్తంగా భయాందోళనకు గురయ్యారు, ఈ సంవత్సరం మార్చి మాసంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రపంచ సువార్తికుడు పాస్టర్ ప్రవీణ్ పగడాల హచ్ పట్ల ప్రపంచ వ్యాప్తంగా క్రైస్తవులందరూ తీవ్రమైన భయాందోళనకు గురయ్యారు, పాస్టర్ ప్రవీణ్ పగడాల హత్య తదనంతరం కూడా రాష్ట్రవ్యాప్తంగా పలు చర్చిలపై దాడులు ప్రార్థనల జరిగే తప్పుడు పలు ఇబ్బందులు గురి చేయటం పాస్టర్లని పాస్టర్ రమ్మని కొట్టడం దాడి చేసి తిరిగి వారి పైన కేసులు పెట్టడం, మతోన్మాదులు కొంతమంది క్రీస్తు జననాన్ని కించపరుస్తూ మాట్లాడటం పాస్టర్ ప్రవీణ్ని మరణాన్ని కూడా వ్యంగ్యంగా హేళన చేయటం ఇటువంటి పలు సంఘటనలు జరిగిన సందర్భంలో రాష్ట్రవ్యాప్తంగా క్రైస్తవులందరూ భయాందోళన గురయ్యారని ప్రధానంగా పాస్టర్లు స్వేచ్ఛగా సువార్తను ప్రకటించుకునే అవకాశం లేకుండా పోతుందని, ఇటువంటి సందర్భంలో భారత రాజ్యాంగ ప్రకారం లౌకిక రాజ్యాంగాన్ని అమలు చేసే క్రమంలో భాగంగా క్రైస్తవ మైనార్టీల పట్ల వారి రక్షణ కొరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకమైన చట్టం రూపొందించాలని క్రైస్తవుల్ని ఆదుకోవాలని రక్షించాలని ఆ ఆ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని డాక్టర్ గోళ్ళమూడి తెలిపారు.

సమావేశానికి సభాధ్యక్షులుగా పాస్టర్ సుధీర్ కుమార్( షాలోమ్ చర్చ్ వ్యవస్థాపకులు సత్తెనపల్లి ) వ్యవహరించి రక్షణ చట్టం గురించి పాస్టర్ల పరిస్థితులు గురించి వివరంగా సమావేశంలో పాస్టర్ల అందరికీ చెప్పారు. అన్ని రాజకీయ పార్టీలు పాస్టర్ల రక్షణ చర్చిల రక్షణ క్రైస్తవుల రక్షణ కొరకు రాష్ట్ర ప్రభుత్వం రూపొందించాల్సిన రక్షణ చట్టానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో పాల్గొన్న యుపిఎఫ్ నూతన జిల్లా అధ్యక్షులు ఆర్చి రావు, మాజీ జిల్లా అధ్యక్షులు జీవ రత్నం లు పాస్టర్ల క్రైస్తవుల చర్చిల రక్షణ చట్టం ఏ విధంగా ఉండాలో అవగాహన కల్పించాల్సిన అవసరం పాస్టర్లకు ఉందని క్రైస్తవ సంఘాల నాయకులకు ఉందని ఆయన అన్నారు. నేషనల్ క్రిస్టియన్ బోర్డ్ జిల్లా అధ్యక్షులు పి సుబ్బారావు ( జోసఫ్ ) మాట్లాడుతూ పలు సమస్యలపై పరిష్కారం గురించి పాస్టర్లకు అవగాహన కల్పించేందుకు జిల్లా వ్యాప్తంగా పాస్టర్ లందరికీ ఓ సమావేశం ఏర్పాటు చేస్తామని, ఆ సమావేశానికి అన్ని చర్చిలు మినిస్ట్రీలు ఫెలోషిప్పుల పాస్టర్ లందరూ కదలి రావాలని పది రోజుల్లో ఆ సమావేశానికి తేదీ సమయాన్ని, వేదికను నిర్ణయిస్తామని ఆయన తెలిపారు నేడు జరిగిన పాస్టర్ల సమావేశానికి రొంపిచర్ల మండలం పిడుగురాళ్ల మండలం చిలకలూరిపేట మండలం నరసరావుపేట మండలం నరసరావుపేట టౌను రొంపిచర్ల మండలం, సత్తెనపల్లి మండలం లకు చెందిన వివిధ చర్చిల పాస్టర్లు పాల్గొని తమ యొక్కసంఘటన శక్తిని తెలియజేస్తూ పాస్టర్లందరూ సమస్యల పరిష్కారానికి నడుం కడదామని నిర్ణయించారు.

## కంటెపూడిలో ఫ్లోరోసిస్ నియంత్రణ, నివారణ కార్యక్రమం




**సత్తెనపల్లి మేజర్ న్యూస్:** మండలం కో–లొకేటెడ్ పీహెచ్ సి (పణిదం) పరిధిలోని కంటెపూడి ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య మందిరము నందు జాతీయ ఫ్లోరోసిస్ నియంత్రణ, నివారణ కార్యక్రమం పై అవగాహన కార్యక్రమము నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గుంటూరు జిల్లా ఫ్లోరోసిస్ నియంత్రణ అధికారి డాక్టర్ గిరిధర్ కుమార్ హాజరై ఫ్లోరోసిస్ నియంత్రణ, నివారణ గురించి గ్రామస్థాయిలో పనిచేస్తున్న ఎం ఎల్ హెచ్ పి/ సి హెచ్ ఓ లకు, మండల స్థాయి సూపర్వైజర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం కన్సల్టెంట్ డా. గిరిధర్ కుమార్ మాట్లాడుతూ ఫ్లోరోసిస్ ఏ విధముగా వ్యాపిస్తుందో, దాన్ని ఏ విధంగా నివారించగలరో తెలియజేశారు. బోర్ వెల్ లోని త్రాగునీటి ద్వారా, పొగాకు సంబంధిత వస్తువుల ద్వారా, బ్లాక్ సాల్ట్, బ్లాక్ టీ వంటివి మితిమీరి ఉపయోగిస్తే ప్రజలు త్వరగా పోరోసిస్ వ్యాధి బారిన పడతారని వివరించారు. కంటెపూడి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 3,4,5 తరగతి పిల్లలందరికీ వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. అలాగే కమ్యూనిటీ సర్వే కూడా గ్రామాల్లో చేయాలని వివరించారు. నివారణలో భాగంగా రక్షిత త్రాగునీరు, కాల్షియం, విటమిన్ ఇ, విటమిన్ – సి అధికంగా ఉన్న పండ్లు– కూరగాయలు తీసుకోవాలన్నారు. అవగాహన కార్యక్రమంలో ఎం ఎల్ హెచ్ పి ఎం. నాని, ఆరోగ్య కార్యకర్తలు జి. చిన్న కోటమ్మ,బి. వి. నాగలక్ష్మి, అంగన్వాడి , ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద ఇంటి నిర్మాణానికి రూ.2.50లక్షలు మంజూరు

**– సొంత స్థలం కలిగిన వారి నుంచి దరఖాస్తుల ఆహ్వానం**
**– నగర కమిషనర్ అలీం బాషా**



**మంగళగిరి, మేజర్ న్యూస్ :** మంగళగిరి –తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో సొంత స్థలం కలిగి ఉండి ఇల్లు నిర్మించుకునే ఆర్థిక స్థోమత లేని పేదలు సంబంధిత సచివాలయాల్లో కానీ, నగర పాలక సంస్థ కార్యాలయంలో కానీ సంప్రదించి కావలసిన ధ్రువీకరణ పత్రాలు జతపరచి తగు వివరాలు పొందాలని నగర పాలక సంస్థ కమిషనర్ అలీం బాషా తెలిపారు. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. నగర పాలక సంస్థ పరిధిలో పక్కా ఇల్లు లేని పేదలకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) కింద పక్కా ఇళ్ల నిర్మాణానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. బెనిఫిషయరీ ల్యాండ్ కన్స్ట్రక్షన్ (బీఎల్ సీ) కింద అంటే సొంత స్థలం ఉండి ఇల్లు నిర్మించుకునే ఆర్థిక స్థోమత లేని వారి వద్ద నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద ఇంటి నిర్మాణ ఖర్చుల నిమిత్తం రూ. 2.50 లక్షలను మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. కావున నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ అలీం బాషా కోరారు.

## ఎన్.ఆర్.ఐ. ఆసుపత్రిలో విజయవంతంగా ప్రత్యక్ష శస్త్ర చికిత్స



**మంగళగిరి, మేజర్ న్యూస్:** మంగళగిరి –తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి చినకాకాని ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజ్, టిసిటి ఇండియా– 2025 కోసం ఒక అత్యంత క్లిష్టమైన కార్డియాక్ ఇంటర్వెన్షన్‌ను ప్రత్యక్షంగా ప్రదర్శిస్తూ తన వైద్య నైపుణ్యాన్ని అత్యాధునిక సాంకేతికతను ప్రదర్శించింది. 73 ఏళ్ల వయసు గల రోగికి తీవ్రమైన క్యాల్సిఫైడ్ కొరోనరీ లెషన్లు ఉన్న నేపథ్యంలో ఈ శస్త్రచికిత్స నిర్వహించారు. ఈ చికిత్సలో లెషన్ ప్రిపరేషన్ కోసం ఒర్బిటల్ అతెరెక్టమీ ను ఉపయోగించగా, స్టెంట్ పెట్టే ప్రదేశాన్ని అచ్చంగా నిర్ణయించేందుకు ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజిలో మాత్రమే అందుబాటులో ఉన్న ఆల్ట్రాన్ 2.0 ఆప్టికల్ కో హెరాన్స్ టోమోగ్రఫీ సాంకేతికతను వినియోగించారు. ముఖ్యంగా ఈ అత్యాధునిక చికిత్స ఎన్టీఆర్ వైద్య సేవా పథకం క్రింద ఉచితంగా నిర్వహించబడింది. ఇది తక్కువ వనరులున్న రోగులకు ప్రపంచస్థాయి చికిత్సను అందించాలన్న ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజ్ యొక్క నిబద్ధతను మరొకసారి నిరూపించిందని అడ్మినిస్ట్రేటర్ మండవ విష్ణువర్ధన్ రావు వైద్యులను అభినందించారు. ఈ శస్త్రచికిత్సను డా. జాన్ సతీష్, డా. అవుల సురేంద్ర పర్యవేక్షణలో డా. కృష్ణప్రసాద్, డా. సుభాష్, డా. రఘునందన్, డా. రవితేజ నిర్వహించారు.

## కంకణాలపల్లిలో సుపరిపాలనలో తొలి అడుగు

**– పాల్గొన్న ఎంపీ లావు ఎమ్మెల్యే కన్నా**





**సత్తెనపల్లి మేజర్ న్యూస్:** మండలం లోని కంకణాలపల్లి గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మి నారాయణ,పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదరిక నిర్మూలనే లక్ష్యంగా సుపరిపాలన కూటమి ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీలని 80% శాతం పూర్తి చేశామన్నారు. గత ఐదేళ్లలో రాష్ట్రంలో విధ్వంసం జరిగిందన్నారు. ప్రతి రైతుకు అన్నదాత సుఖీభవ అందిస్తాం అన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభిస్తామన్నారు. అనంతరం తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు స్వర్గీయ డాక్టర్ శ్రీ నందమూరి తారక రామారావు విగ్రహ ఆవిష్కరణ వాటర్ ప్లాంట్ ప్రారంభోత్సవ కార్యక్రమం లో పాల్గొన శాసన సభ్యులు కన్నా లక్ష్మి నారాయణ పార్లమెంట్ సభ్యులు శ్రీ లావు శ్రీకృష్ణదేవరాయలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వివిధ హెూదాల్లో వున్న రాష్ట్ర జిల్లా నియోజకవర్గ మండల గ్రామ కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పేదల్ని ఆర్థికంగా స్థితిమంతుల్ని చేయాలన్నదే సీఎం చంద్రబాబు ఆశయం

**– మార్కెట్ యార్డ్ చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్**



**మంగళగిరి, మేజర్ న్యూస్:** ముఖ్యమంత్రి మానసపుత్రిక పీ–4 పథకం... పేదల్ని ఆర్థికంగా స్థితిమంతుల్ని చేయాలన్న ధృఢ చిత్తంతోనే ఆయన మార్గదర్శుల సేవల్ని కోరుతున్నారని, సంపన్నులు మానవతా ధృక్పథంతో పేదలసేవలో భాగస్వాములు కావాలని మంగళగిరి వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్ పిలుపునిచ్చారు. శనివారం మంగళగిరి మండలం పెద్దవడ్లపూడి గ్రామంలోని సచివాలయం నందు అవగాహన సదస్సు జరిగింది. ముఖ్య అతిథులుగా అడిషనల్ కమిషనర్ శకుంతల, హౌసింగ్ పీడీ ప్రసాద్, మంత్రి, పిఎస్ హరగోపాల్, హాజరయ్యారు. ఈ సందర్భంగా జవ్వాది మాట్లాడుతూ పేదరికం లేని సమాజం కోసమే పి4 విధానాన్ని ప్రభుత్వం అమలు చేస్తుందని జవ్వాది అన్నారు. పి4 అంటే లేని వ్యక్తికి ఆర్థిక సాయం రైతులకు సాయం పిల్లలకు సహాయం ఉద్యోగ సాయం ఇలా ఏదైనా సాయం చేయవచ్చని కనీసం మాట సాయమైనా చేయవచ్చునని ఆయన సూచించారు. గత పాలకుల విధ్వంసంతో కోలుకోలేని విధంగా దెబ్బతిన్న రాష్ట్రాన్ని ఏడాదిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంత్రి నారా లోకేష్ గాడిలో పెట్టారని ఆయన అన్నారు. అభివృద్ధి దిశగా పరుగులు పెట్టించే దిశగా పాలన కొనసాగిస్తున్నారని జవ్వాది చెప్పారు. ప్రభుత్వం త్వరలోనే ప్రభుత్వ కొత్త పింఛన్లు మంజూరు చేయనున్నదని ఆయన తెలిపారు. ఆగస్టు 15 నుంచి ప్రారంభమయ్యే ఉచిత బస్సు ప్రయాణాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని జవ్వాది సూచించారు. యువతకు ఉపాదే లక్ష్యంగా పలు కంపెనీలతో ఒప్పందాలు పెట్టుబడులు సాధన దిశగా ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుం టుందన్నారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే ఎస్సీ ఎస్టీ బీసీ యువతకు ఇప్పటికే ప్రభుత్వం ఉచిత శిక్షణ అందిస్తుందన్నారు. పి4 విధానానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు పేదరిక నిర్మూలన లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని జవ్వాది కిరణ్ చంద్ అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు యేళ్ళ శివరామయ్య, మాదల రమేష్ బాబు, అన్నే చంద్రశేఖర్, చిట్టి బొమ్మ వెంకటేశ్వరరావు, కొడవలి ఆనంద్,జాలాది సందీప్, మొద్దుకూరి రమేష్ బాబు, కఠారి సాంబయ్య, కంచర్ల బద్రి, కట్టా దుర్గారావు, నాగళ్ళ రామకృష్ణ, యం డి కరిముల్లా, పట్రా శ్రీనివాసరావు, శరణు విష్ణు శానం రఘు, కొప్పాక ఓంకార్ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## పిడుగురాళ్ళలో స్వయంగా టీ పెట్టి, నాయకులకు అందజేసిన ఎమ్మెల్యే "యరపతినేని"



**పిడుగురాళ్ళ, మేజర్ న్యూస్ :** పల్నాడు జిల్లా పిడుగురాళ్ళ పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన "మన అడ్డా టీ కేఫ్"ను గురజాల శాసన సభ్యులు యరపతినేని శ్రీనివాసరావు శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి గురజాల శాసన సభ్యులు యరపతినేని శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా విచ్చేసి "మన అడ్డా టీ కేఫ్" ప్రారంభించి, ఆయనే స్వయంగా టీ పెట్టి, పార్టీ నాయకులకు అందించారు.

## పాస్పోర్ట్ దరఖాస్తుల విచారణ సేవల్లో గుంటూరు ద్వితీయ స్థానం



**గుంటూరు జిల్లా క్రైమ్ మేజర్ న్యూస్ :** పాస్పోర్ట్ దరఖాస్తుల విచారణ సేవలో రాష్ట్రంలో గుంటూరు జిల్లా ద్వితీయ స్థానం సాధించింది. గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ నాయకత్వాన్ని విజయవాడ ప్రాంతీయ పాస్పోర్ట్ అధికారి శివ హర్ష అభినందించి ప్రశంసా పత్రాన్ని అందించారు. జూలై 2024 నుండి జూన్ 2025 మధ్యకాలంలో 30వేలకు పైగా పాస్‌పోర్ట్ దరఖాస్తులను కేవలం 3 రోజుల వ్యవధిలోనే విచారణ పూర్తి చేసి అత్యుత్తమ ప్రదర్శనను కనబరిచి రాష్ట్రవ్యాప్తంగా ద్వితీయ స్థానం సాధించి గొప్ప విజయాన్ని నమోదు చేశారు. శనివారం(26.07.2025) విజయవాడ ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో గుంటూరు జిల్లా పోలీస్ విభాగం తరపున జిల్లా ఎస్పీ విభాగం సీఐ అలహరి. శ్రీనివాస అవార్డును అందుకోవడం జరిగింది. గుంటూరు జిల్లా పోలీస్ విభాగం ఈ గుర్తింపుతో మరింత ప్రోత్సాహంతో ముందుకు సాగుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు.

## గరికపాటి నరసింహారావు ఆధ్యాత్మిక సందేశం



**నరసరావుపేట మేజర్ న్యూస్ :** నాగసరపు రామారావు ట్రస్ట్ మరియు ఆధ్యాత్మిక తరంగిణి సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక పట్టాభిరామ దేవస్థానంలో నిర్వహించిన "వేదాంత భేరి" ప్రవచన కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. ప్రముఖ ప్రవచనకర్త పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ గరికపాటి నరసింహారావు ఈ కార్యక్రమంలో పాల్గొని ఆధ్యాత్మిక సందేశాలతో భక్తులను ఉత్తేజపరిచారు. ఈ కార్యక్రమానికి శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు కుటుంబ సభ్యులు మరియు మాజీ మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయ గుప్తా కుటుంబ సభ్యులు గరికపాటిని సాదరంగా ఆహ్వానించారు. గరికపాటి నరసింహారావు తన ప్రవచనంలో వేదాంత సూత్రాలు, జీవన విలువలు, మరియు ఆధ్యాత్మిక జ్ఞానాన్ని సరళంగా వివరించి, శ్రోతలను కట్టిపడేశారు. రామాయణం, భాగవతం వంటి గ్రంథాల నుండి ఉదాహరణలతో వారు చేసిన ప్రసంగం భక్తులను ఆకట్టుకుంది. కార్యక్రమానికి విచ్చేసిన భక్తులు, స్థానిక ప్రముఖులు ఈ ప్రవచనం ద్వారా ఆధ్యాత్మిక ఉత్తేజాన్ని పొందినట్లు తెలిపారు. నాగసరపు రామారావు ట్రస్ట్ మరియు శ్రీ ఆధ్యాత్మిక తరంగిణి నిర్వాహకులు ఈ కార్యక్రమ విజయానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగి, పట్టాభిరామ దేవస్థానంలో భక్తి భావాన్ని మరింత పెంపొందించింది.

# జిల్లా ఎస్పీ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్న మంగళగిరి రూరల్ ఎస్ఐ వెంకట్



**మంగళగిరి,మేజర్ న్యూస్:** ఉత్తమ నైపుణ్యంపాటు వృత్తి పట్ల అంకితభావంతో సమర్థవంతంగా విధులు నిర్వర్తించిన మంగళగిరి రూరల్ ఎస్సై చిరుమామిళ్ల వెంకట్ జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం జరిగిన అర్థ సంవత్సర వార్షిక నేర సమీక్ష సమావేశంలో కేసుల విచారణలో కీలకంగా వ్యవహరించిన పలువురు పోలీస్ అధికారులకు జిల్లా ఎస్పీ ప్రశంసా పత్రాలను అందజేశారు. అందులో భాగంగా గత ఏడాది జూలైలో మంగళగిరి రూరల్ ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన వెంకట్ మండలంలో 154 కేసులను లోక్ అదాలత్ లో రాజీ చేయించడమే కాకుండా పలు గంజాయి బ్యాచ్ లను అరెస్టు చేశారు. మంగళగిరి రూరల్ స్టేషన్ పరిధిలో నేరాల రేటు గణనీయంగా తగ్గించడంలో ముఖ్యపాత్ర పోషించారు. ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించడంలో మంగళగిరి పోలీసులు చేస్తున్న కార్యాచరణలో రూరల్ ఎస్సై వెంకట్ పాత్ర ఎంతో ప్రముఖమైనదని చెప్పవచ్చు. ముఖ్యంగా గ్రామస్థాయిలో వివాదాలను సామరస్యంగా పరిష్కరించడం మంగళగిరి రూరల్ పోలీసింగ్ కు ఆదర్శంగా నిలిచింది. మంగళగిరి రూరల్ స్టేషన్ సిబ్బంది కృషిని డి. ఎస్. పి మురళి కృష్ణ సిఐ శ్రీనివాసరావు ప్రశంసించారు. జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ చేతుల మీదుగా తాను ప్రశంసా పత్రం అందుకోవడం పట్ల రూరల్ ఎస్సై వెంకట్ హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ప్రజలకు మెరుగైన సేవలను అందించడానికి మరింతగా కృషి చేస్తానన్నారు.

# అధిక రేట్లకు మద్యం విక్రయిస్తే షాపులను సీజ్ చేస్తాం

**– గుంటూరు జిల్లా ఎక్సైజ్ సూపరిండెంట్ శ్రీనివాసులు హెచ్చరిక**



**మంగళగిరి, మేజర్ న్యూస్ :** ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించిన బార్ , వైన్ షాప్ యజమానులపై కఠిన చర్యలు తప్పవని గుంటూరు జిల్లా ఎక్సైజ్ సూపరిండెంట్ శ్రీనివాసులు హెచ్చరించారు. శనివారం ఆయన మంగళగిరి ఎక్సైజ్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. నూతన ప్రభుత్వం నూతన ఎక్సైజ్ పాలసీ ప్రకటించింది. అందులో భాగంగా మంగళగిరిలోని వైన్ షాపులు, బార్ల యజమానులతో సమావేశం నిర్వహించామన్నారు. వారందరికీ ప్రభుత్వ నియమ నిబంధనలు మేరకు వ్యాపారాలు నిర్వహించుకోమని, అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపామన్నారు.

టెక్నాలజీ సాయంతో ఎక్సైజ్ ఐ యాప్ నిఘానేత్రం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఉదయం, రాత్రి అన్ని బార్ అండ్ రెస్టారెంట్లు, వైన్ షాపులను మానిటరింగ్ చేస్తామని తెలిపారు. ఈ యాప్ ద్వారా ప్రతిరోజు ఉదయం పది, రాత్రి 10 గంటల తర్వాత ఎక్సైజ్ సిబ్బంది సంబంధిత బార్ అండ్ రెస్టారెంట్లు, వైన్ షాపుల వద్దకు వెళ్లి ఎక్సైజ్ ఐ యాప్ ద్వారా ఫోటోలు తీసి మానిటరింగ్ చేయడం జరుగుతుందన్నారు. ఎక్సైజ్ సిబ్బంది షాపులకు వెళ్లిన తర్వాత ఎక్సైజ్ ఐ యాప్ ద్వారా అధికారులకు సమాచారం వెళుతుందన్నారు. తద్వారా అక్కడ ఏవైనా ప్రభుత్వ నిబంధనలకు అతిక్రమించిన విషయం అధికారులకు సమాచారం ఇస్తుందన్నారు. తద్వారా సంబంధిత పోలీస్ స్టేషన్లకు సమాచారం వెళ్లి జీరో ఎఫ్ ఐ ఆర్ కేసులు కూడా నమోదు అవుతాయని తెలిపారు.

ఎక్సైజ్ యాప్ బార్లు వైన్ షాపుల్లో తప్పులుంటే ఇట్టే పసి కడుతుందని తెలిపారు. గుంటూరు, పల్నాడు జిల్లాలు అన్ని చెక్పోస్టులు, బార్ అండ్ రెస్టారెంట్లు, వైన్ షాపుల్లో సీసీ కెమెరాలు కూడా ఉపయోగిస్తామని, ఎలాంటి అవతవకులు ఉన్న ఈ ఎక్సైజ్ ఐ యాప్ ద్వారా మొత్తం రాష్ట్ర కార్యాలయానికి పంపిస్తుందన్నారు. మద్యం అమ్మకాలలో ఎటువంటి అవతవకలు జరగకూడదని ఈ యాప్ ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించిన వారిపై నేటి వరకు 2458 కేసులు నమోదు చేసి 1451 మందిని అరెస్ట్ చేసినట్టు ఆయన తెలిపారు. 3011 లీటర్లు అక్రమ మద్యం స్వాధీనం చేసుకున్నామని, 1.0144 ఎండిఎంఏ డ్రగ్ స్వాధీనం చేసుకున్నామని 25 వెహికల్స్ ను సీజ్ చేశామని శ్రీనివాసులు తెలిపారు. అలాగే 847 బెల్ట్ షాపులను గుర్తించి 849 మంది అరెస్ట్ చేశారు అన్నారు. 2,392 లీటర్లు అక్రమ మద్యం, 239 లీటర్లు బీరు బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. కల్తీ కల్లు లేకుండా వివిధ ప్రాంతాలలో 269 కల్లు శాంపిల్స్ తీశామని ఆయన అన్నారు. 379 బార్లో శాంపిల్స్ సేకరించి పరీక్షలు నిర్వహించామన్నారు.

బహిరంగంగా మద్యం సేవించే వారిపై 423 కేసులు నమోదు చేసి 433 మందిని అరెస్ట్ చేశామన్నారు. తెలంగాణ కర్ణాటక తమిళనాడు గోవా ప్రాంతాల నుండి నాన్ పెయిడ్ లిక్కర్ తీసుకొచ్చి అమ్ముతున్న 206 మందిని ఎన్డీపిఎల్ చట్టం కింద కేసు నమోదు చేసి బైండోవర్ చేశామన్నారు.

అలాగే గత ఐదేళ్లుగా గంజాయి అమ్ముతున్న 77 మందిని బైండోవర్ చేసామన్నారు. అందులో 5 మంది తిరిగి గంజాయి అమ్ముతుంటే వారిపై 35 వేల రూపాయలు చొప్పున జరిమానాలు విధించినట్లు తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు అతిక్రమించి మద్యం షాపుల్లో అధిక రేట్లకు మద్యం విక్రయిస్తే వారి షాపులు క్లోజ్ చేస్తామని ఆయన హెచ్చరించారు. తిరిగి 5 లక్షల 50 వేల రూపాయలు చెల్లిస్తే గాని షాపుకు పర్మిషన్ ఉండదని ఆయన తెలిపారు. ఏది ఏమైనా బార్ వైన్ షాప్ లో యజమానులు ప్రభుత్వ నిబంధనల మేరకే నడుచుకోవాలని సూచించారు.

ప్రభుత్వ రెవెన్యూ ఆదాయం తగ్గకుండా ప్రభుత్వం నవోదయం 2.0 అనే ప్రోగ్రామ్ ద్వారా రెండు జిల్లాలలోని అన్ని పట్టణ మండల జిల్లా కేంద్రాలలో అవేర్నెస్ ప్రోగ్రాం చేస్తున్నామన్నారు. గుంటూరు పల్నాడు జిల్లాలను నాటు సారా రహిత జిల్లాలుగా గత జూన్ 16న ప్రకటించడం జరిగిందన్నారు. ఆ మేరకు మార్పు చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. గత ఏడాది అక్టోబర్ నుండి లాటరీల ద్వారా మద్యం షాపులు వేలం పాటలు నిర్వహించమన్నారు. ఈ విలేకరుల సమావేశంలో ఎక్సైజ్ సీఐ వీరాంజనేయులు పాల్గొన్నారు.

# ఆటో మ్యుటేషన్ ద్వారా బహుళ ప్రయోజనాలు





నగర కమిషనర్ అలీం బాషా

**మంగళగిరి, మేజర్ న్యూస్ :** ఆటో మ్యుటేషన్ ద్వారా బహుళ ప్రయోజనాలు చేకూరనున్నాయని నగర కమిషనర్ అలీం బాషా అన్నారు. శనివారం మంగళగిరి –తాడేపల్లి నగర పాలక సంస్థ కార్యాలయంలో సచివాలయ అడ్మిన్ సెక్రెటరీ లకు, రెవెన్యూ సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో నగర కమిషనర్ అలీం బాషా మాట్లాడుతూ...మున్సిపల్ సేవల్లో పారదర్శకత పెంచేందుకు వీలుగా ప్రభుత్వం కొత్తగా ఆటో మ్యుటేషన్ విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చిందని, ఇప్పటికే విజయవాడలో ప్రయోగాత్మకంగా దీనిని అమలు చేస్తున్నారని తెలిపారు. సత్ఫలితాలు రావడంతో రాష్ట్రంలోని అన్ని కార్పొరేషన్ల పరిధిలో ఆగస్టు ఒకటో తేదీ నుంచి అమలుకు ఆదేశాలిచ్చినట్లు తెలిపారు. పురపాలక, స్టాంపులు, రిజస్ట్రేషన్ శాఖలు సమన్వయంతో ఈ పద్ధతి అమలు చేయనున్నట్లు తెలిపారు. నగరంలో ఏదైనా స్థలం గానీ, లేదా ఇల్లు గానీ తీసుకుంటే కొనుగోలుదారులు ఆ ఆస్తిని తమ పేరిట మార్చుకునేందుకు నగర పాలక సంస్థ కార్యాలయంలో ప్రత్యేకంగా దరఖాస్తు చేయాలని తెలిపారు. సచివాలయం ద్వారా రిజస్టర్డ్ డాక్యుమెంట్లు ఆన్లైన్లో పంపితే కార్పొరేషన్ అధికారులు పరిశీలించి టైటిల్ మార్చి పన్ను విధిస్తారని కానీ, కొత్త విధానంలో ఈ సమస్య లేకుండా రిజస్ట్రేషన్ తరువాత ఆస్తి వివరాలు, పన్నుల నమోదు... ప్రాపర్టీ టాక్స్ రికార్డులో ఆటో మేటిక్ గా చేరతాయని తెలిపారు. దీనివల్ల పౌరులకు సమయం ఆదా అవుతుందని, వివిధ కార్యాలయాలకు ఒకే పని కోసం తిరగాల్సిన అవసరం లేకుండా డిజిటల్ డేటా ఆధారంగా పారదర్శకతతో కూడిన సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. రిజస్ట్రేషన్ సమయంలో గతంలో ఆ ఇంటికి చెల్లిస్తున్న పన్ను రసీదు సమర్పించాలని, స్థలమైతే వేకెంట్ ల్యాండ్ టాక్స్ రసీదు అందజేయాలని తెలిపారు. తద్వారా ఆటోమేటిక్ గా మున్సిపల్ రికార్డుల్లోకి పేరు మారి వస్తుందని, అవి లేని పక్షంలో పన్ను వేయాల్సిన అవసరాన్ని వివరిస్తూ రిజస్ట్రార్ కార్యాలయం నుంచి మున్సి పల్ లాగిన్ కు సమాచారం వస్తుందని తెలిపారు. ఆ మేరకు పేరు మార్చి పన్ను విధిస్తారని, ఒకే ఆస్తిని ఇద్దరు, ముగ్గురు కలిసి కొనుగోలు చేసినా ఇదే విధానం వర్తిస్తుందన్నారు. 'ఆగస్టు ఒకటి నుంచి జరిగే రిజస్ట్రేషన్లకు ఈ సదు పాయం వర్తిస్తుందని, ఆ సమయంలోనే సరైన వివరాలు అందించి ఆటో మ్యుటేషన్ సదుపాయాన్ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కమీషనర్ అలీం భాష కోరారు. ఈ అవగాహన సదస్సు లో అడిషనల్ కమీషనర్ శకుంతల ,డిప్యూటీ కమీషనర్ శ్రీకాంత్ ,మంగళగిరి సబ్ రిజిస్ట్రార్ కె బాల గురవయ్య, పెదకాకాని సబ్ రిజిస్ట్రార్ డి భాస్కర్ రావు , సి డి ఎం ఎ( కమీషనర్ & డైరెక్టర్ ఆఫ్ మునిసిపాల్ అడ్మినిస్ట్రేషన్) ప్రధాన కార్యాలయ ఐ టీ నిపుణులు జవహర్, అసిస్టెంట్ కమీషనర్ పి శ్రీనివాసరావు ,రెవెన్యూ సిబ్బంది,అడ్మిన్ సెక్రెటరీ లు పాల్గొన్నారు.

# పెదకాకాని సిఐ పనితీరు పలువురికి ఆదర్శనీయం



**పెదకాకాని మేజర్ న్యూస్ :** విధుల పట్ల అంకితభావంతో పనిచేస్తూ పలు కీలక కేసుల దర్యాప్తులో పురోగతి కనబరుస్తున్న పెదకాకాని సీఐ నారాయణస్వామిని జిల్లా ఎస్పీ ప్రశంసా పత్రంతో శనివారం అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నారాయణస్వామి పనితీరును పలువురు అధికారులు ఆదర్శంగా తీసుకోవాలని పేర్కొన్నారు పలు కేసుల్లో సమగ్ర దర్యాప్తు జరిపి, కీలక ఆధారాలు సేకరించినందుకు జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ శనివారం ప్రశంసా పత్రంతో సత్కరించడం పట్ల మండల ప్రజలు, పోలీస్ సిబ్బంది అభినందనలు తెలియజేశారు. ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని పలువురు పేర్కొన్నారు.

# జే కే ఆర్ ఆధ్వర్యంలో 28 వ రోజుకు రిలే నిరసన దీక్ష

**– ఎకరానికి కోటి రూపాయలు 1250 గజాలు భూమి ఇవ్వాలని డిమాండ్**

**– రైతు కూలీలకు ప్రతి నెలరూ 10 వేలు ఆర్థిక సహాయం చేయాలి**

**గుంటూరు సిటీ మేజర్ న్యూస్ :**

రాజధాని రైతుల కోసం రిలే నిరసన దీక్ష కార్యక్రమాన్ని గత 28 రోజుల నుంచి నిడుముక్కల గ్రామం తాటికొండ మండలం గుంటూరు జిల్లా నందు ఆయన రిల్లే నిరసన దీక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు, ఈ సందర్భంగా ఆయన ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో రైతుల గురించి ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సెకండ్ ల్యాండింగ్ పూలింగ్ కింద నష్టపోయిన రియల్ ఎస్టేట్ ప్రమోటర్స్ కు నష్టపరిహారం చెల్లించాలని, రైతులకు ఒక ఎకరానికి రూ. ఒక కోటి లేదా గవర్నమెంట్ వాల్యూషన్ ప్రకారం నాలుగు శాతం మరియు 1250 గజాలు భూమి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆయన రిల్లే నిరసన దీక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. గతంలో కూడా ప్రభుత్వం ఏర్పడినప్పుడు రాష్ట్ర ప్రజలకు అనేక పథకాలు చెప్పి రైతులను కూడా మోసం చేయడం జరిగిందని ఆయన తెలిపారు.రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పైబడిన కూడా రాజధాని రైతులకు ఎక్కడ కూడా న్యాయం జరగలేదని ఆయన తెలిపారు. ప్రతి ఒక్క రాజధాని రైతుకు ప్రభుత్వం వెంటనే స్పందించి తగ్గిన నష్టపరిహారం చెల్లించే వరకు నా పోరాటం ఆగదని రిలే నిరసన దీక్ష నిర్వహించడం ఆగదని ఆయన తెలిపారు. ఆ పార్టీ వచ్చినప్పుడు ఈ పార్టీ వచ్చినప్పుడు అనేక రకాలుగా రాష్ట్ర ప్రజలను రైతులను అనేక రకాలుగా ఇబ్బందులు పెట్టి మోసం చేస్తున్నారని ఆయన అన్నారు. అన్ని పార్టీలకు మద్దతుగా ఈ రిలే నిరసన దీక్ష కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. గతంలో కూడా టిడిపి ప్రభుత్వం రైతులను మోసం చేసిందని ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం మేలుకొని రాజధాని రైతులకు తగ్గిన న్యాయం చేయాలని ఏ ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు జనం కోటేశ్వరరావు డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమాన్ని గత 28 రోజుల నుంచి ఈ రిల్లే నిరసన దీక్షలో రైతులు కూడా అధిక సంఖ్యలో పాల్గొని ఆయనకు మద్దతు తెలిపారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి గతంలో ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రాజధాని ప్రాంతం ఎక్కడ ఉంది దానిని ఎక్కడ తెలపాలి కూడా తెలియని పక్షంలో ఆయన పరిపాలన సాగించారని తెలిపారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరన్నర కావస్తున్నా రైతులకి కూడా ఎక్కడ కూడా న్యాయం జరగలేదని అన్నారు ఆ పార్టీ వచ్చినప్పుడు ఒకసారి ఈ పార్టీ వచ్చినప్పుడు ఇంకోసారి అనేక రకాలుగా ప్రజలకు మాటలు చెప్పి అధికారంలోకి రాగానే వాళ్ల గురించి మర్చిపోతున్నారని ఆయన తెలిపారు. ప్రభుత్వం రైతులకు తగిన న్యాయం చేసే వరకు నా రిల్లే నిరసన దీక్ష కార్యక్రమం కొనసాగుతూనే ఉంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొన్న రైతులు ఆయనకు మద్దతు తెలిపారు.



## పేదరిక నిర్మూలనకు పీ-4 వారధి

- అత్యంత వెనుకబడిన ప్రాంతం గుంటూరు తూర్పు నియోజకవర్గం
- మార్గదర్శకులుగా మారి సేవకు సహకార
- అందించండి
- వైద్యులతో సమావేశమైన తూర్పు ఎమ్మెల్యే నసీర్



**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో :** బంగారు కుటుంబాలకు సమాజంలో సరైన గౌరవం అందించే దిశగా అడుగులు వేస్తున్నామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. శనివారం స్థానిక శాసనసభ్యుల వారి కార్యాలయంలో డిఎంహెచ్ఓ, ఇతర వైద్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ గుంటూరు జిల్లాలో ఏడు నియోజకవర్గాల్లో 75 వేల బంగారు కుటుంబాలను గుర్తిస్తే అందులో 25 వేలు గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఉన్నాయని తెలిపారు. గుంటూరు తూర్పు నియోజకవర్గం వెనకబడిన ప్రాంతమని, పీ-బి4 కార్యక్రమం ద్వారా ఆర్థిక ప్రగతి సాధిస్తామని వెల్లడించారు. దీనికి వైద్యులు పూర్తి సహకారం అందించాలని, మార్గదర్శకులుగా మారి బంగారు కుటుంబాలకు వెన్నుదన్నుగా నిలవాలనిచ పిలుపునిచ్చారు. ఇలాంటి గొప్ప కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన సీఎం చంద్రబాబు నాయుడు కు ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమం విజయవంతం ద్వారా సమాజంలో ఆర్థిక అసమానతలు తొలగించవచ్చని, పేదరికాన్ని నిర్మూలించవచ్చని పేర్కొన్నారు.

**అందరి సహకారం అవసరం..** బంగారు కుటుంబాల జీవన ప్రమాణాలు పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ పిలుపునిచ్చారు శనివారం మేయర్ కోవెలమూడి నాని కమిషనర్ పులి శ్రీనివాసులతో కలిసి గుంటూరు మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ హాల్ లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. నగరంలో పేదరిక నిర్మూలనకు పి-ఫోర్ కార్యక్రమం ఒక వారదిగా మారుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యే ప్రతి ఒక్కరినీ ఆహ్వానిస్తున్నామని తెలిపారు. అన్ని వర్గాల వారితో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి మార్గదర్శకులుగా గుర్తిస్తున్నామని వెల్లడించారు.

## దుర్గి ఊరకుంటలో లో భారీ మొసలి కలకలం..!

**దుర్గి, మేజర్ న్యూస్ :** దుర్గి మండల శివారులోని ఊరకుంటలో శుక్రవారం ఓ భారీ మొసలి ప్రత్యక్షమైంది. ఈ దృశ్యాలను యువకులు మొబైల్ ఫోన్లలో చిత్రీకరించి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో వైరల్ అయ్యింది. గ్రామానికి సమీపంలో మడేలయ్య స్వామి గుడి వద్ద, పశువుల సంచారం ఎక్కువగా ఉండే ప్రాంతంలో మొసలి కనిపించడంతో ప్రజలు తీవ్ర భయాం దోళనలకు గురవుతున్నారు. అధికారులు తక్షణమే చర్యలు తీసుకుని మొసలిని పట్టుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## ఢిల్లీ ఏపీ భవన్‌లో రెండు రోజుల పాటు హరిహర వీరమల్లు చిత్ర ప్రదర్శన

**గుంటూరు, మేజర్ న్యూస్ :** దేశ రాజధాని ఢిల్లీలో నిత్యం బిజీ జీవితం గడుపుతున్న తెలుగు అధికారులు, ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులతోపాటు వివిధ రంగాల్లో విధులు నిర్వర్తిస్తున్న తెలుగు వారి కోసం రాష్ట్ర ఉపముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారు నటించిన హరిహర వీరమల్లు చిత్రాన్ని రెండు రోజుల పాటు ఏపీ భవన్ లో ప్రదర్శిస్తున్నారు. వారాంతపు సెలవు దినాలు అయన శని, ఆదివారాల్లో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆడిటోరియంలో రెండు షోలు వేస్తున్నట్టు ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్ శ్రీ లవ్ అగర్వాల్ ప్రకటన విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వంలో వివిధ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న తెలుగు వారి కోసం ఢిల్లీలో స్థిరపడిన తెలుగు వారి కోసం చిత్రాన్ని ప్రదర్శిస్తున్నారు. శనివారం రాత్రి 7 గంటలకు మొదటి షో వేయగా ఆడిటోరియం ప్రేక్షకులతో నిండిపోయింది. 27వ తేదీ ఆదివారం సాయంత్రం 4 గంటలకు మరో షో వేయనున్నారు. ప్రేక్షకుల నుంచి చక్కటి స్పందన లభించింది.

# అవయవదానంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధచూపాలి!

### అవయవదాన ప్రచారకర్తగా స్వచ్ఛంధ బాధ్యత స్వీకరిస్తా!

### వైద్య ఉద్యోగుల సంఘ నేత జీ.వీ.వీ.ప్రసాద్ వెల్లడి



**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో :** "అమ్మ ద్వారా జననం.. అవయవదానం ద్వారా పునర్జన్మం!" ఈ సందేశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి అవయవదానం పట్ల పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని అవయవదాత, వైద్య ఉద్యోగుల సంఘం నాయకులు జీ.వీ.వీ.ప్రసాద్ అభిప్రాయపడ్డారు. శనివారం నాడాయన పత్రికల వారితో మాట్లాడుతూ, ఇదే విషయమై తాను రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖామంత్రి సత్యకుమార్ యాదవ్ ను స్వయంగా కలవనున్నానని వెల్లడించారు. తనువు మట్టిలో కలిసినా తన అవయవాలతో మరొకరికి జన్మనివ్వడమే అవయవదానమని, ఈ సత్కార్యంపై ప్రజలకు అవగాహన కల్పించి, అపోహలను తొలగిస్తే కొన ఊపిరితో వున్నా ఎంతో మంది ప్రాణాలు నిలబెట్టి పునర్జన్మనివ్వచ్చన్నారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పక్కా ప్రణాళిక సిద్ధం చేయాల్సిన అవసరం ఎంతైనా వుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో అవయవదాన ప్రచార కార్యక్రమం కోసం జిల్లా కేంద్రాల్లో కో ఆర్డినేటర్ లను నియమించి, వారి పర్యవేక్షణలో అన్ని మండల కేంద్రాలు, ముఖ్యప్రాంతాల్లో ప్రచార కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలన్నారు. ముఖ్యంగా, రాష్ట్రం నలుమూలలా స్వచ్ఛంధ సేవా సంస్థలు పుష్కళంగా వున్నాయని, ప్రాణధానమైన అవయవదానంపై ప్రచారానికి ముందుకురావాలని ప్రభుత్వం స్వచంధసంస్థలకు ఒక్క పిలుపునిస్తే మంచి స్పందన వస్తుందని, సేవాభావంతో పనిచేసేందుకు ఎన్నో సంస్థలు తప్పకుండ ముందుకొస్తాయని ప్రసాద్ అన్నారు.

**అవయవదాతల. ను ప్రభుత్వం ప్రోత్సహించాలి**

ఎంతో పెద్ద మనస్సుతో అవయవదానానికి స్వచ్ఛంధ్దంగా ముందుకొచ్చే ప్రాణదాతలు మరింతగా పెరగాలంటే ప్రభుత్వం మరిన్ని ప్రోత్సాహకాలు అందించాల్సిన ఆవశ్యకత ఎంతైనా వుందని అవయవదాత ప్రసాద్ తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఇదే విషయమై తాను రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖామంత్రిని కలిసి తనకున్న మరిన్ని ఆలోచనలను పంచుకుంటానన్నారు. అదే సందర్భంలో అవయవదాన ప్రచారకర్తగా తాను మంత్రి సమక్షంలో స్వచ్ఛంధ్దంగా బాధ్యతలు స్వీకరిస్తానని ప్రసాద్ వెల్లడించారు. ఆగస్టు 13 ప్రపంచ అవయవదాన దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వం నుంచి ఆరోజు ఈ సత్కార్యం గురించిన స్పష్టమైన ప్రకటన వచ్చేలా ప్రయత్నం చేస్తానని ప్రసాద్ ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

# సీతమ్మ కాలనీ అభివృద్ధికి ప్రగతి బాట: ఎమ్మెల్యే గళ్లా మాధవి

### రూ. 2.7 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**గుంటూరు, మేజర్ న్యూస్ :** గుంటూరు పశ్చిమ నియోజకవర్గం 28వ డివిజన్ అభివృద్ధికి ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రత్యేక చొరవ తీసుకొని ప్రగతి బాటలు వేస్తున్నారు. శనివారం గుంటూరు 28వ డివిజన్ సీతమ్మ కాలనీలో రూ . 2.7 కోట్లతో సిసి రోడ్లు, డ్రైన్లు, కల్వర్ట నిర్మాణానికి ఎమ్మెల్యే గళ్ళా మాధవి శంకుస్థాపన చేసారు. ఈ సందర్భముగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ.. శనివారం సీతమ్మ కాలనీ, ఎన్జీఓస్ కాలనీలలో రూ . 2.7 కోట్ల తో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయటం చేయటం జరిగింది. ఈ సీతమ్మ కాలనీ వెనుకబడిన ప్రాంతంగా ఉండేది, గడిచిన 5 ఏళ్ళ వైసిపి పాలనలో కార్పొరేటర్ ఈ ప్రాంతంను అభివృద్ధి చేయకుండా నిర్లక్ష్యం చేసారు. నేను ఎమ్మెల్యేగా గెలిచిన అనంతరం ఇక్కడ సిసిరోడ్లు, డ్రైన్లు, మంచి నీటి కుళాయి కనెక్షన్లు, కల్వర్ట్ ల నిర్మాణాలు చేసాము. గుంటూరు పశ్చిమ నియోజకవర్గములో అభివృద్ధి పనులు అన్నీ డివిజన్ లలో చేపట్టామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. ఈ రోజు సీతమ్మ కాలనీ 4వ లైన్, 4/1, 4/2 లైన్ల వద్ద మరియు 5/1 నుండి 5/6 క్రాస్ లలో రూ. 80 లక్షలతో సిసి రోడ్ల నిర్మాణం, 1వ, 2వ లైన్, 4వ లైన్, 5/1 లైన్ క్రాస్ రోడ్ (రెండు వైపులా) వద్ద రూ .49.90 లక్షలతో CC డ్రెయిన్లు మరియు RCC కల్వర్టుల నిర్మాణం, 4వ లైన్, 4/1,5/4,5/5 లైన్లు (రెండు వైపులా) వద్ద రూ . 49.50 లక్షలతో CC డ్రెయిన్లు మరియు RCC కల్వర్టుల నిర్మాణాలు అదే విధముగా ఎన్జీఓస్ కాలనీ ప్రధాన రోడ్డు YSR విగ్రహం దగ్గర నుండి రూ.17 లక్షలతో CC రోడ్డు మరియు CC డ్రెయిన్ నిర్మాణము, వేణుగోపాల స్వామి ఆలయం నుండి రూ.10 లక్షలతో CC డ్రైన్లనిర్మాణం మొత్తం : 2.7 కోట్లు పనులకు శంకుస్థాపన చేశామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. డివిజన్ అధ్యక్షుడు తెల్లగోర్ల అప్పారావు, కసుకుర్తి హనుమంతరావు, శ్రీను,నాంచారమ్మ, సాంబశివరావు,మదమంచి శ్రీను, పి.రాము, చిరంజీవి,శ్రావణి నాయక్,ఆంజనేయులు, వంశి కృష్ణ,మల్లి, జీవన్ , జక్కయ్య,భాను,ఆదాము,చిట్టమ్మ , కొండయ్య పాల్గొన్నారు.

## వైసీపీ నాయకుల తీరు అవిటి, గుడ్డి గుర్రాల మాదిరిగా ఉంది: గాదె, బోనబోయిన విమర్శ



**గుంటూరు, మేజర్ న్యూస్:** అమరావతి రోడ్డులో ఉన్న గుంటూరు పశ్చిమ నియోజకవర్గం కార్యాలయంలో ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల విడుదలైన హరిహర వీరమల్లు చిత్రాన్ని ఆదరిస్తున్న తెలుగు రాష్ట్ర ప్రజలందరికీ కూడా ధన్యవాదాలు తెలిపారు . పవన్ కళ్యాణ్ డిప్యూటీ సీఎం అయిన తర్వాత మొట్టమొదటి సినిమా అవడం వలన రెండు తెలుగు రాష్ట్రాలలో అన్ని చోట్ల కూడా సంబరాలు అంబరాన్ని అంటాయని అన్నారు. ఇది ఇలా ఉంటే వైసీపీ నాయకుల తీరు రోజురోజుకి దిగజారి పోతున్నది అని విమర్శించారు. వైసిపి వాళ్ళకి కనీస పరిజ్ఞానం లేదని, నారాయణమూర్తి అనే వ్యక్తికి కంప్లైంట్ ఎలా రాయాలో కూడా తెలియని స్థాయిలో అతను ఉన్నాడని, మళ్లీ అతను వైసిపి కేంద్ర కార్యాలయ ఫిర్యాదుల విభాగ అధ్యక్షుడని, ఇప్పటికైనా కనీస పరిజ్ఞానంతో ప్రవర్తిస్తే బాగుంటుందని అన్నారు. వైసీపీ నాయకులు ఇచ్చిన ఫిర్యాదును చదివి వినిపిస్తూ అర్థంపర్థం లేని కంప్లైంట్ అని, ఈ కంప్లైంట్ ని %ఖీ×=% కట్టమని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. పవన్ కళ్యాణ్ గారు కేవలం సోషల్ మీడియాలో ఎవరైతే విమర్శలు చేస్తున్నారో, కేవలం వారికి మాత్రమే దీటుగా సమాధానం ఇమ్మని చెప్పారని, అందులో తప్పేముందని ప్రశ్నించారు. వైసీపీ నాయకుల మాదిరిగా రప్ప రప్ప నరకమని చెప్పలేదని, ఇదే తీరులో వైసిపి నాయకుడు మాజీ మంత్రి పేర్ని నాని మాట్లాడితే మీకు ఫిర్యాదు చేయాలని అనిపించలేదా.. నారాయణమూర్తి అని ప్రశ్నించారు. పవన్ కళ్యాణ్ గారు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారని చెప్పడం వారి అజ్ఞానానికి నిదర్శనమని, తణుకులో జరిగిన సంఘటన సినిమా ప్రీ రిలీజ్ రోజున అనగా 23వ తేదీన జరిగిందని, పవన్ కళ్యాణ్ సక్సెస్ మీట్ లో మాట్లాడింది 24 వ తారీకు అని, ఆ మాత్రం కనీసం ఇంగిత జ్ఞానం కూడా లేకుండా పవన్ కళ్యాణ్ గారు రెచ్చగొట్టారని చెప్పటం వాళ్ళ అవగాహన రాహిత్యానికి నిదర్శనం అని అన్నారు. వైసీపీ నాయకులు కేవలం పవన్ కళ్యాణ్ గారి మేర ఏదో ఒక నింద మోపాలనే ఆలోచన తప్పించి, వారి మాటలు ఏమాత్రం నమ్మే పరిస్థితిలో ఆంధ్ర రాష్ట్ర ప్రజానీకం లేదని అన్నారు. పవన్ కళ్యాణ్ గారిని రాజకీయాలలోనూ మరియు సినిమాలలోనూ ప్రజలు ఆదరిస్తున్న తీరును ఓర్వలేక వైసిపి నాయకులు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకొని ప్రజాస్వామ్య యుతంగా ప్రవర్తించాలని హితువు పలికారు. అలాగే కంప్లైంట్ లో సినిమా రిలీజ్ సందర్భంగా చేసిన ర్యాలీల వల్ల రాష్ట్ర ప్రజలందరూ ఇబ్బంది పడ్డారని రాశారని, వైసీపీ నాయకులు కాకుండా రాష్ట్రంలో ఏ ఒక్క వ్యక్తి అయినా సరే ఎక్కడైనా పవన్ కళ్యాణ్ గారి అభిమానుల వల్ల గాని,జనసైనికుల వల్ల గాని మేము ఇబ్బంది పడ్డాం అనే మాట ఒకరి నోట్లో నుంచైనా దమ్ముంటే వైసీపీ నాయకులు చెప్పించాలని చెప్పి సవాల్ విసిరారు. వైసిపి వాళ్లు ఎన్ని అబద్ధాలు చెప్పినా ఎన్ని కుట్రలు చేసినా పవన్ కళ్యాణ్ గారు ప్రజల మనిషిని, ఆయన చేస్తున్న పరిపాలనను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. రాష్ట్ర ప్రజలందరూ కూడా రాబోయే రోజుల్లో జనసేన పార్టీకి మరియు జనసేన నాయకుడికి అండగా నిలబడాలని ప్రజలందరినీ కోరారు. అలాగే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్ యాదవ్ గారు మాట్లాడుతూ ఇటీవల విడుదలైన హరిహర వీరమల్లు చిత్రాన్ని ఆదరిస్తున్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే ఇది కుటుంబంతో సహా చూడవలసిన సినిమా అని, మన చరిత్రను తెలియజేసే విధంగా ఈ సినిమా ఉందని అన్నారు. ఇలాంటి సినిమా తీయాలంటే ఆదర్శకునికి నిర్మాతకి అలాగే అందులో నటించినా హీరోకు కూడా సామాజిక బాధ్యత మరియు దమ్ము ఉన్న వాళ్లు మాత్రమే ఇలాంటి చిత్రాన్ని చేయగలరని అన్నారు. ఇదిలా ఉంటే వైసిపి నాయకుల తీరు అవిటి, గుడ్డి గుర్రాల మాదిరిగా ఉందని అన్నారు. సీనియర్ నాయకులు చందు సాంబశివరావు, జిల్లా ప్రచార కమిటీ కోఆర్డినేటర్ శిఖా బాలు, జిల్లా కార్యదర్శి చట్టాల త్రినాథ్, కార్పొరేటర్ యర్రంశెట్టి పద్మావతి, ప్రతిపాడు %ూవీజ% చైర్మన్ బొందలపాటి ఉమా, యర్రంశెట్టి సూరి మరియు తదితరులు పాల్గొన్నారు.